
శ్రద్ధాత్రయవిభాగయోగము



ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా. (17-23)

పరబ్రహ్మమునకు 'ఓమ్' అనియు, 'తత్' అనియు, 'సత్' అనియు మూడువిధములగు పేర్లు చెప్పబడినవి. ఈ నామత్రయమువలననే (దాని యుచ్ఛారణ చేతనే) పూర్వము బ్రాహ్మణులు (బ్రహ్మజ్ఞానులు), వేదములు, యజ్ఞములు నిర్మింపబడినవి.

ఓం

శ్రీ భగవద్గీత

అథ సప్తదశోఽధ్యాయః

పదునేడవ అధ్యాయము

శ్రద్ధాత్రయ విభాగయోగః

శ్రద్ధాత్రయ విభాగయోగము

ఈ అధ్యాయముయొక్క పేరు :-

''శ్రద్ధాత్రయ విభాగయోగము'' - శ్రద్ధ మూడువిధములుగా నుండును. సాత్త్వికశ్రద్ధ, రాజసికశ్రద్ధ, తామసికశ్రద్ధ అని. ఏ యే శ్రద్ధగలవాని లక్షణములు ఏ యే విధముగనుండునో ఈ అధ్యాయమున వివరముగ దెలుపబడినవి. ఈ ప్రకారముగ మూడు విధములైన శ్రద్ధను (గుణమును) గుఱించి చెప్పబడిన అధ్యాయమగుటవలన దీనికి శ్రద్ధాత్రయవిభాగయోగమను పేరు కలిగెను.

ఈ అధ్యాయమందలి ప్రధాన విషయములు :-

(1) మూడువిధములైన శ్రద్ధను గుఱించిన విషయము - (1 వ శ్లో॥నుండి 3 వ శ్లో॥ వఱకు)

(2) మూడువిధములైన ఆరాధన - శాస్త్రవిరుద్ధమగు ఘోరతపస్సు (4 వ శ్లో॥ నుండి 6 వ శ్లో॥ వఱకు)

(3) మూడువిధములైన ఆహారము - (7 వ శ్లో॥ నుండి 10 వ శ్లో॥ వఱకు)

(4) మూడువిధములైన యజ్ఞము (11 వ శ్లో॥ నుండి 13 వ శ్లో॥ వఱకు)

(5) మూడువిధములైన తపస్సు (14 వ శ్లో॥ నుండి 19 వ శ్లో॥ వఱకు)

(6) మూడువిధములైన దానము - (20 వ శ్లో॥ నుండి 22 వ శ్లో॥ వఱకు)

(7) ఓం తత్ సత్ - అను మంత్రముయొక్క వ్యాఖ్య - (23 వ శ్లో॥ నుండి 27 వ శ్లో॥ వఱకు)

(8) అశ్రద్ధతోచేయు కార్యముయొక్క ఫలితము - (28 శ్లోకము)

పూర్వాధ్యాయముతో ఈ అధ్యాయమునకుగల సంబంధము:-

క్రిందటి అధ్యాయముయొక్క చివర భగవానుడు శాస్త్రాదేశములకు భిన్నముగ ప్రవర్తింపరాదనియు, శాస్త్రవిధి నుల్లంఘించి విచ్చలవిడిగ ప్రవర్తించినచో మోక్షసిద్ధి లభించదనియు చెప్పగా ఆ వాక్యములను వినినపుడు అర్జునుని మనంబున నొక సంశయముదయించెను. అది యేదనగా - యెవ్వరైన అజ్ఞానమువలనగాని, లేక మఱియొక కారణమువలనగాని శాస్త్రవిధిని వదలివేసి, శ్రద్ధతో గూడుకొనినవారై పూజాయజ్ఞాదు లాచరించుచుండినచో అట్టివారి పరిస్థితి యేవిధముగనుండును? వారియొక్క ప్రవర్తన

సత్త్వగుణసంబంధమైనది యగునా? లేక, రజోగుణసంబంధమైనది యగునా? లేక తమోగుణసంబంధమైనది యగునా? అని. అట్టి సంశయము కలుగగనే అర్జునుడు వెంటనే దానినిగూర్చి భగవానుని ప్రశ్నించివైచెను. అర్జునుని యా ప్రశ్నతో ఈ అధ్యాయము ప్రారంభమగుచున్నది.

అర్జున ఉవాచ –

1. యే శాస్త్రవిధిముత్సృజ్య యజన్తే శ్రద్ధయాఽన్వితాః
తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః.

అర్జున ఉవాచ = అర్జునుడు అడిగెను.

టీక:– కృష్ణ = ఓ కృష్ణా! యే = ఎవరు, శాస్త్రవిధిమ్ = శాస్త్రోక్తవిధానమును, ఉత్సృజ్య = విడిచి, శ్రద్ధయా అన్వితాః = శ్రద్ధతోగూడకొనినవారై, యజన్తే = పూజాదుల నొనర్చుచున్నారో, తేషామ్ = వారియొక్క, నిష్ఠాతు = స్థితి (ప్రవృత్తి), కా = ఎట్టిది?, సత్త్వమ్ = సాత్త్వికమా, ఆహో= లేక, రజః = రాజసమా, (అథవా = లేక) తమః = తామసమా?

తా:– అర్జునుడు అడిగెను – ఓ కృష్ణా! ఎవరు శాస్త్రోక్తవిధానమును విడిచిపెట్టి శ్రద్ధతో గూడుకొని పూజాదుల నొనర్తురో వారియొక్క స్థితి సాత్త్వికమా, లేక రాజసమా, లేక తామసమా? ఏదియైయున్నది?

వ్యాఖ్య:– క్రిందటి అధ్యాయముయొక్క చివర శాస్త్రవిధి నుల్లంఘించి స్వేచ్ఛాచారులై ప్రవర్తించువారికి మోక్షసిద్ధి కలుగదని చెప్పబడినది. అయితే కొందఱు శాస్త్రనిర్దిష్టములగు విధినిషేధములను శ్రమయనితలంచియో, లేక, ఔదాసీన్యము వహించియో, వానినిగూర్చి తెలిసికొనుటకై యత్నింపక, శ్రద్ధతోగూడుకొనినవారై, ఆస్తికబుద్ధి గలిగి దేవతాదులను అర్చించుచుందురుగదా! అట్టివారియొక్క ప్రవృత్తి యెట్టిది? అది సాత్త్వికమా, రాజసమా, తామసమా అని అర్జునుని ప్రశ్న –

అ॥ అర్జునుని యా ప్రశ్నకు భగవానుడు సమాధాన మొసంగుచున్నాడు –

శ్రీ భగవానువాచ –

2. త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా
సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు.

శ్రీ భగవానువాచ = శ్రీ భగవంతుడు చెప్పెను –

టీక:– దేహినామ్ = ప్రాణులయొక్క, స్వభావజా = స్వభావముచే (పూర్వజన్మ సంస్కారములచే) గలిగిన, సా శ్రద్ధా = ఆ శ్రద్ధ, సాత్త్వికీ = సాత్త్విక (సత్త్వగుణసంబంధమైన) శ్రద్ధయనియు, రాజసీ చ ఏవ= రాజస (రజోగుణసంబంధమైన) శ్రద్ధయనియు, తామసీ చ ఇతి = తామస (తమోగుణసంబంధమైన) శ్రద్ధయనియు, త్రివిధా = మూడువిధములుగా, భవతి = అగుచున్నది, తామ్ = దానిని, శృణు = వినుము.

తా:– శ్రీ భగవంతుడు చెప్పెను – ప్రాణులయొక్క స్వభావముచే (పూర్వజన్మ సంస్కారముచే) గలిగిన ఆ శ్రద్ధ సాత్త్వికమనియు, రాజసమనియు, తామసమనియు మూడు విధములుగా నగుచున్నది. దానిని గూర్చి వినుము.

వ్యాఖ్య:– 'సా స్వభావజా' - అని చెప్పుటవలన పూర్వజన్మ సంస్కారమువలన, జన్మాంతర వాసనాప్రాబల్యమువలన అట్టిశ్రద్ధ వారియందు స్వభావముగనే జనించునని భావము.

ప్ర:– శ్రద్ధ యెన్ని విధములు? అవి యేవి?

ఉ:– మూడువిధములు - అవి క్రమముగ (1) సాత్త్వికశ్రద్ధ (2) రాజసికశ్రద్ధ (3) తామసికశ్రద్ధ అని చెప్పబడును.

ప్ర:– అట్టి శ్రద్ధ జీవులకెట్లు జనించును?

ఉ:– స్వభావముగనే. అనగా జన్మాంతరసంస్కారప్రాబల్యమువలన, లేక ఇహజన్మప్రయత్నాతిశయమున సహజముగనే అది జనించునని భావము.

అ॥ శ్రద్ధయే (సంస్కారమే లేక గుణమే) మనుజుని స్వరూపమనియు వచించుచున్నాడు -

3. సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత
శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః.

టీక:– భారత = ఓ అర్జునా! సర్వస్య = సమస్తజీవులకును, సత్త్వానురూపా = వారివారి (పూర్వజన్మసంస్కారముతోగూడిన) అంతఃకరణము ననుసరించిన, శ్రద్ధా = శ్రద్ధ (గుణము, సంస్కారము) భవతి = కలుగుచున్నది, అయమ్ = ఈ, పురుషః = జీవుడు, శ్రద్ధామయః = శ్రద్ధయే స్వరూపముగా గలవాడు, యః = ఎవడు, యచ్ఛ్రద్ధః = ఎట్టిశ్రద్ధగలవాడో, సః = అతడు, సః ఏవ = అట్టిశ్రద్ధయే, (భవతి = అగుచున్నాడు), (అట్టిశ్రద్ధనే గ్రహించుచు తద్రూపుడే అయియుండునని భావము).

తా:– ఓ అర్జునా! సమస్తజీవులకును వారివారి (పూర్వజన్మసంస్కారముతో గూడిన) యంతఃకరణము ననుసరించి శ్రద్ధ (గుణము, సంస్కారము) కలుగుచున్నది. ఈ జీవుడు శ్రద్ధయే స్వరూపుగ గలవాడైయున్నాడు. ఎవడెట్టిశ్రద్ధగలిగియుండునో ఆతడట్టి శ్రద్ధయే యగుచున్నాడు. (అట్టిశ్రద్ధనే గ్రహించును; తద్రూపుడే అయియుండునని భావము).

వ్యాఖ్య:– మనస్సే (అంతఃకరణమే) మనుజుడు (ప్రతిబింబరూపజీవుడు); మనుజుడు మనస్సే. కావున మనస్సు శుద్ధముగా నున్నచో మనుజుడున్ను శుద్ధరూపుడే యగుచున్నాడు. ఇచట 'సత్త్వానురూపా' అను పదములోని సత్త్వమనగా అంతఃకరణము. ప్రతివారికిని వానివాని జన్మాంతర సంస్కారములతో గూడిన యంతఃకరణమెట్లుండునో అట్టిశ్రద్ధ, అట్టిసంస్కారము, అట్టిగుణము వానికి కలుగుచున్నది. ఎవడు ఏ శ్రద్ధ ఏ గుణము గలిగియుండునో ఆతడు తద్రూపుడే అయియుండును. కాబట్టి మొట్టమొదట మనుజుడు తనయంతఃకరణమును శుద్ధమొనర్చుకొని సాత్త్వికశ్రద్ధామయుడై యుండులాగున ప్రయత్నించి, సాధనాభ్యాసముచే క్రమముగ నిర్గుణాత్మరూపుడై చెన్నొందుటకు ప్రయత్నించవలెను. ఎవనియొక్క చిత్త మెట్టి శ్రద్ధ, గుణము గలిగియుండునో తదనుగుణ్యమగు ప్రవృత్తియే ఆతడు కలిగియుండుటబట్టి (రాజసిక, తామసిక, శ్రద్ధలను పారద్రోలి) సాత్త్వికశ్రద్ధనవలంబించి క్రమముగ దానినిన్ని అధిరోహించి విశుద్ధసత్త్వ (ఆత్మ) స్థితిని జేరుకొనవలెను. అదియే ఆతని యథార్థస్వరూపము. స్థానము.

ప్ర:- జీవులకు ఎట్టిశ్రద్ధ గలుగుచున్నది?

ఉ:- వారి యంతఃకరణమెట్లుండునో దాని కనుగుణ్యమగు శ్రద్ధయే (గుణమే) కలుగుచున్నది.

ప్ర:- మనుజు డెద్దానిచే పరిపూర్ణుడైయుండును?

ఉ:- శ్రద్ధచే.

ప్ర:- మనుజుని స్వరూపమేమి?

ఉ:- అతడెట్టి శ్రద్ధగలిగియుండునో, అదియే యాతని స్వరూపము (అయితే ఇది ప్రతిబింబిత (జీవ) రూపము. వాస్తవముగ బింబభూతమగు ఆత్మయే ఆతనిస్వరూపమని యెఱుగవలెను).

అ॥ ఎవడెట్టి శ్రద్ధ (గుణము) గలిగియుండునో తదనుగుణ్యమైన ధ్యేయమునే ఆతడారాధించునని వచించుచున్నాడు -

4. యజన్తే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః
ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజన్తే తామసా జనాః.

టీక:- సాత్త్వికాః = సత్త్వగుణముగలవారు, దేవాన్ = దేవతలను, యజన్తే = పూజించుచున్నారు, రాజసాః = రజోగుణముగలవారు, యక్షరక్షాంసి = యక్షులను, రాక్షసులను, (యజన్తే = పూజించుచున్నారు), అన్యే = ఇతరులగు, తామసాః జనాః = తమోగుణముగల జనులు, ప్రేతాన్ = ప్రేతములను, భూతగణాన్ చ = భూతగణములను, యజన్తే = పూజించుచున్నారు.

తా:- సత్త్వగుణముగలవారు దేవతలను, రజోగుణముగలవారు యక్షులను, రాక్షసులను, తమోగుణముగలవారు భూతప్రేతగణములను పూజించుచున్నారు.

వ్యాఖ్య:- ఎవరెవరు ఏ యే గుణము గలిగియుందురో, వారిస్వభావము, వారి నడక, వారియాహారము, వారిమాట, వారితీరు, వారు చదువుగ్రంథములు, వారు పూజించుదేవతలు - తదనుగుణ్యముగనేయుండును. ఈ విషయము నిదివఱకు 14వ అధ్యాయమున తెలిపియుండిరి. భావము దృఢపడుటకొఱకై మఱల నిపుడు తెలియుజేయుచున్నారు.

అ॥ అసురస్వభావముగల వారాచరించు ఘోరతపస్సులు త్యాజ్యములని రెండుశ్లోకములద్వారా చెప్పుచున్నాడు -

5. అశాస్త్రవిహితం ఘోరం తప్యన్తే యే తపో జనాః
దమ్భాహఙ్కారసంయుక్తాః కామరాగబలాన్వితాః.

6. కర్శయ న్తశ్శరీరస్థం భూతగ్రామమచేతసః
మాం చైవాన్తశ్శరీరస్థం తాన్విద్ధ్యాసుర నిశ్చయాన్ .

టీక:– యేజనాః = ఏ జనులు, శరీరస్థమ్ = శరీరముననున్నట్టి, భూతగ్రామమ్ = పంచభూతముల సమూహమును, లేక ఇంద్రియసమూహమును, కర్శయన్తః = (ఉపవాసాదులచే) శుష్కింపజేయువారును, అన్తశ్శరీరస్థమ్ = శరీరమునందు అంతర్యామిగనున్న, మామ్ చ ఏవ = నన్నును, కర్శయన్తః = శుష్కింపజేయువారును (కష్టపెట్టువారును), దమ్భాహంకారసంయుక్తాః = దంభము, అహంకారము - వీనితో గూడినవారును, కామరాగబలాన్వితాః = కామము, రాగము (ఆసక్తి), (పశు) బలము కలవారును, (లేక కామబలము, రాగబలము కలవారును), అచేతసః = అవివేకులును అయి, అశాస్త్రవిహితమ్ = శాస్త్రమునందు విధింపబడనిదియు, ఘోరమ్ = తనకును ఇతరులకును గూడ బాధాకరమైనదియునగు, తపః = తపస్సును, తప్యన్తే = ఆచరించుచున్నారో, తాన్ = వారిని, ఆసురనిశ్చయాన్ = అసురస్వభావము గలవారినిగ, విద్ధి = తెలిసికొనుము.

తా:– ఏ జనులు శరీరముననున్నట్టి పంచభూతసముదాయమును లేక ఇంద్రియ సమూహమును (ఉపవాసాదులచే) శుష్కింపజేయువారును, శరీరమందంతర్యామిగనున్న నన్నును కష్టపెట్టువారును, దంభాహంకారములతో గూడినవారును, కామము, రాగము (ఆసక్తి), పశుబలము కలవారును (లేక కామబలము, రాగబలము గలవారును), అవివేకులును అయి శాస్త్రమునందు విధింపబడనిదియు, తమకును ఇతరులకును గూడ బాధాకరమైనదియునగు తపస్సును జేయుచున్నారో, అట్టివారిని అసురస్వభావము గలవారినిగ తెలిసికొనుము.

వ్యాఖ్య:– 'అశాస్త్రవిహితమ్' - శాస్త్రమునందు విధింపబడనికార్యముల నెవరును చేయరాదని గీత శాసించుచున్నది. ఘోరతపస్సులు, భయంకర రాజస, తామస క్రియలు శాస్త్రవిహితములు కావు. కాబట్టి శాస్త్రవిరుద్ధములగు అట్టి క్రియలు నింద్యములేయగును.

'తప్యన్తే యే తపోజనాః' - వాస్తవముగ తపస్సనగా అంతఃకరణమునందుగల దోషములను భస్మమొనర్చుటయేకాని దేహాదులను క్షీణింపజేయుటగాదని యెఱుగవలెను. కావున అట్టి తపస్సునే ఆశ్రయింపవలెనుగాని తనకును, ఇతరులకును ఉపద్రవకరము లైనట్టి క్రూరతపస్సులను (రావణ, హిరణ్యకశిపు లొనరించినవానిని) కాదు.

'కామరాగబలాన్వితాః' - ప్రాపంచిక బలము లెన్నియున్నను, దైవబలములేనిచో అవియన్నియు నిరుపయోగములేయగును. క్షుద్రబలములు కలవారు, దైవగంధము లేనివారు వారెవరైననుసరియే రాక్షసులక్రిందనే జమకట్టబడుదురు. కామరాగములు మానవులయొక్క మానవత్వమును, తదంతర్గతమగు దేవత్వమును హరించివైచి, వారి పారమార్థికతను పీల్చి పిప్పిచేసి, నిజాత్మస్వరూపమును గప్పివైచి వారలను రాక్షసులనుగా మార్చివేయగలవు. కావున వానిని త్యజించివేయవలెను. అసురస్వభావులకు కామమే బలము, రాగమే బలము; దైవీసంపదగలవారికి భక్తియే బలము, జ్ఞానమే బలము. కాబట్టి కామ, రాగ బలమును వదలివేసి భక్తి, జ్ఞానాదిబలమునే స్వీకరించవలెను.

'కర్శయన్తః శరీరస్థం భూతగ్రామమ్' - శుష్కోపవాసాదులచే ఇంద్రియాదులను కృశింపజేయువారు అసురస్వభావులని యిట చెప్పబడినది. దేహారోగ్యముకొఱకు, వ్రతాదుల నిమిత్తము ఉపవాసమును అపుడపుడు శీలించుట మంచిదే అయినను, అది మితముదప్పి యుండరాదు. అట్లు మితముతప్పినచో అది ఆసురికతపస్సేయగును. పుట్టనుకొట్టినంతమాత్రమున లోని పాము చావదు. కాబట్టి కేవల దీర్ఘశుష్కోపవాసాదులచే లోనగల దుర్వాసనాదుస్సంస్కారాదులెవ్వియు నశింపనేరవు. కొందఱు తమ యొక్క ఆ

యుపవాసాదులనుగూర్చి ఘనముగ చెప్పుకొందురు. కాని భగవానుడీ శ్లోకములందు వానిని మెచ్చుకొనలేదు. పైగా అట్లు దేహాదులనుశుష్కింపజేయువారు అసురస్వభావులని చెప్పివైచిరి. కాబట్టి సాధకులివ్విషయమున జాగరూకులై భగవానుడు సెలవిచ్చినట్లు 'యుక్తాహారవిహారులై' మానవస్థితినుండి దైవస్థితికి ఎగబ్రాకవలెనేకాని అసురస్థితికి దిగజారకూడదు.

'మాం చైవాన్తః శరీరస్థమ్' - 'అట్టి శుష్కోపవాసాదులద్వారా వారి శరీరముల లోపలనున్న నన్ను (భవంతుని) గూడ కృశింపజేయుచున్నార'ని శ్రీకృష్ణపరమాత్మ చమత్కారముగ నిచట పలికిరి. వాస్తవముగ విచారించిన, నిర్వికారుడు కృశించుట యేమి? అయినను అట్టివారి చర్యను గర్హించుటకు భగవాను డీవిధముగ పలికిరి. లేక, కృశింపజేయుచున్నారనగా వారి ఆజ్ఞను నిరాకరించుచున్నారనియు చెప్పవచ్చును. 'అన్తః శరీరస్థమ్' అను ఈ పదముచే భగవానుడు దూరముగా లేరనియు, ప్రతివాని శరీరములోపల (పంచకోశాంతర్గతముగ) దాగియున్నారనియు స్పష్టమగుచున్నది. కావున పాపాచరణమును త్యజించివైచి వివేక విచారణాదులద్వారా పంచకోశములను వేఱుపఱచి నిజశరీరమునందే భగవంతుని కనుగొని జనులు కృతార్థులు కావలయును. మఱియు శుష్కోపవాసాదులచే లోనగల ఆత్మను బాధింపక మధ్యమార్గమును జేబట్టి, మితాహార సాత్త్వికాహారాదుల నవలంబించి, ధ్యానాదులచే దైవానుభూతిని బడసి కృతకృత్యులు కావలెను.

ప్ర:- అసురస్వభావముగలవా రెవరు?

ఉ:- (1) డంబము, అహంకారము కలవారై (2) కామము, రాగము, (పశు) బలముగలవారై (3) అవివేకులై (4) శాస్త్రమందు విధింపబడని ఘోరతపస్సులు చేయుచు ఇంద్రియాదులను శుష్కింపజేయుచు శరీరాంతర్గతుడగు పరమాత్మనుగూడ బాధించువారు అసురస్వభావులే యగుదురు.

ప్ర:- కావున విజ్ఞు లేమి చేయవలెను?

ఉ:- డంబము, అహంకారము, కామము, రాగము - వీనిని త్యజించి వివేకవంతులై, శాస్త్రోక్తరీతి ననుసరించుచు, కేవల శుష్కోపవాసాదుల నాశ్రయింపక, మితాహారాదులను సేవించుచు లోనగల పరమాత్మను భక్తిపూర్వకముగ ధ్యానించవలయును.

అ|| ఇక మూడువిధములైన ఆహారము, యజ్ఞము, తపస్సు, దానములను గూర్చి చెప్పుచున్నాడు -

7. ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః
యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు.

టీక:- ఆహారః తు అపి = ఆహారముకూడ, సర్వస్య = సర్వులకును, త్రివిధః = (సత్త్వాది గుణములనుబట్టి) మూడు విధములుగా, ప్రియః భవతి = ఇష్టమగుచున్నది, తథా = అలాగుననే, యజ్ఞః = యజ్ఞము, తపః = తపస్సు, దానమ్ = దానము (కూడ), త్రివిధః ప్రియఃభవతి = మూడువిధములుగ ఇష్టమగుచున్నది, తేషామ్ = వానియొక్క, ఇమమ్ = ఈ, భేదమ్ = భేదమును, శృణు = వినుము.

తా:- ఆహారముకూడ సర్వులకును (సత్త్వాది గుణములనుబట్టి) మూడు విధములుగ

ఇష్టమగుచున్నది. అలాగుననే యజ్ఞము, తపస్సు, దానముకూడ జనులకు మూడువిధములుగ ప్రియమైయుండుచున్నది. ఆ యాహారాదుల ఈ భేదమును గూర్చి (చెప్పెదను) వినుము.

వ్యాఖ్య:– ఆహారాదులను నాలుగింటిని గుఱించి చెప్పదలంచి భగవానుడు వానిలో ఆహారమును గూర్చియే మొట్టమొదట ప్రస్తావించుట గమనింపదగినది. జీవుని ఆధ్యాత్మిక సాధనక్రమములో ఆహారశుద్ధి ప్రప్రథమమైనది. ఆహారశుద్ధిచే చిత్తశుద్ధి, చిత్తశుద్ధిచే జ్ఞానోదయము సంభవించును. ఆహారము శుద్ధముగలేనిచో మనస్సున్ను మలినముగానుండుటవలన దానివలన లక్ష్యప్రాప్తి చేకూరకయేయుండును.

ప్ర:– ఆహారము, యజ్ఞము, తపస్సు, దానము జనులకు ఎన్నివిధములుగ ప్రియమై యుండును?

ఉ:– వారివారి గుణముననుసరించి మూడు విధములుగ ప్రియమైయుండును (సత్త్వగుణము గలవారికి సాత్త్వికాహారము - ఈప్రకారముగ).

అ॥ అందు సాత్త్వికాహారమునుగూర్చి వచించుచున్నాడు -

8. ఆయుస్సత్త్వబలారోగ్య సుఖప్రీతివివర్ధనాః
రస్యాస్స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాస్సాత్త్వికప్రియాః.

టీక:– ఆయుస్సత్త్వబలారోగ్యసుఖప్రీతివివర్ధనాః = ఆయుస్సును, మనోబలమును, శరీరబలమును, ఆరోగ్యమును, సౌఖ్యమును, ప్రీతిని బాగుగ వృద్ధినొందించునవియు, రస్యాః = రసము గలవియు, స్నిగ్ధాః = చమురుగలవియు, స్థిరాః = దేహమునందు చాలకాలముండునవియు, హృద్యాః = మనోహరములైనవి యునగు, ఆహారాః = ఆహారములు, సాత్త్వికప్రియాః = సత్త్వగుణముగల వారికి ఇష్టములైనవి.

తా:– ఆయుస్సును, మనోబలమును, దేహబలమును, ఆరోగ్యమును, సౌఖ్యమును, ప్రీతిని బాగుగ వృద్ధినొందించునవియు, రసముగలవియు, చమురుగలవియు, దేహమందు చాలకాలముండునవియు, మనోహరములైనవియునగు ఆహారములు సత్త్వగుణముగలవారికి ఇష్టములైయుండును.

వ్యాఖ్య:– జనులయందు సత్త్వగుణ మభివృద్ధినొందునపుడు ఇట్టియాహారము వారికి రుచించునని భావము. అనగా కారముతోను, పులుపుతోనుగూడినదియు, రాజసికమైనదియు లేక తామసికమైనదియు నగు ఆహారము వారికెన్నడును ప్రీతికరము కానేరదు. పైనదెల్పిన సాత్త్వికాహారమే వారికి ఇష్టముగనుండును. ధ్యానాదుల కిట్టి యాహారము మిక్కుటముగ అనుకూలించును. ఆహారవిషయము పరమార్థరంగమున ఎంతయో ముఖ్యమైనది. కనుకనే శ్రీకృష్ణమూర్తి గీతలో పెక్కుచోట్ల దానిని గుఱించి ప్రస్తావించుచువచ్చిరి. కావున ముముక్షువులు ఆహారసంయమము ఏదియో చిన్నవిషయమని తలంపక, బ్రహ్మమార్గమున కీలకస్థాన మాక్రమించియున్నదానినిగ అద్దానిని భావించి సాత్త్వికాహారమునే సేవించుచురావలెను.

ప్ర:– సాత్తికాహార మెట్టిది?

ఉ:– (1) ఆయుస్సును, మనోబలమును, శరీరబలమును, ఆరోగ్యమును, సుఖమును, ప్రీతిని లెస్సగ అభివృద్ధినొందించునదియు (2) రసము గలదియు (3) చమురుతో గూడినదియు (4) దేహమునుందు చాలకాల ముండునదియు, మనోహరమైనదియు సాత్త్వికాహార మనబడును. కావున విజ్ఞు లట్టి యాహారమునే సేవించవలయును.

అ॥ రాజసాహార మేదియో వివరించి చెప్పుచున్నాడు -

9. కట్వామ్ల★లవణాత్యుష్ణ తీక్ష్ణరూక్షవిదాహినః
ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః.

టీక:– కటు = చేదుగాను, అమ్ల = పులుపుగాను, లవణ = ఉప్పగాను, అత్యుష్ణ = మిక్కిలి వేడిగాను, తీక్ష్ణ = కారముగాను, రూక్ష = చమురులేనివిగాను, విదాహినః = మిగుల దాహము గలుగజేయునవిగాను ఉండునవియు, దుఃఖశోకామయప్రదాః = (శరీరమునకు) దుఃఖమును, (మనస్సునకు) వ్యాకులత్వమును, రోగమును గలుగజేయునవియునగు, ఆహారాః = ఆహారపదార్థములు, రాజసస్య = రజోగుణముగలవానికి, ఇష్టాః = ప్రియములు (అయియుండును).

తా:– చేదుగాను, పులుపుగాను, ఉప్పగాను, మిక్కిలి వేడిగాను, కారముగాను, చమురులేనివిగాను, మిగుల దాహము గలుగజేయునవిగాను ఉండునవియు, (శరీరమునకు) దుఃఖమును, (మనస్సునకు) వ్యాకులత్వమును గలుగజేయునవియునగు ఆహారపదార్థములు రజోగుణముగలవానికి ఇష్టములై యుండును.

వ్యాఖ్య:– ఈ శ్లోకమున తెలుపబడిన ఆహాపదార్థములు రాజసములని పేర్కొనుట వలన అవి సర్వథా త్యాజ్యములే అయియున్నవి.

'దుఃఖశోకామయప్రదాః' - ఇచట దుఃఖమనగా భుజించినవెంటనే శరీరాదులకు గలుగు బాధయనియు, శోకమనగా భుజించిన పిమ్మట మనస్సునకు గలుగు క్లేశమనియు గ్రహించవలెను.

కొందఱు 'ఉష్ణ' అను పదమునకు ముందున్న 'అతి' యను విశేషణమును కట్వాది పదములకన్నిటికిని అన్వయించి అర్థము చెప్పిరి. కాని అట్లుచేయుట సమీచీనముగ గన్పట్టలేదు. ఏలయనిన, అత్తఱి 'అతికటుత్వము నిషిద్ధమని అల్పకటుత్వము గ్రాహ్యమని' అర్థమువచ్చును. అది అసమంజసమే యగును. (కొద్ది చేదుకూడ ఎవరును కోరరుగదా). మఱియు 'విదాహినః' అను పదమునకు 'అతి' చేర్చినచో, 'అతివిదాహినః' అగును. అపుడు 'వి' అను ఉపసర్గమీద మఱల 'అతి' అను విశేషణమును జోడించుట అప్రస్తుతముగ నుండగలదు. (రెండును ఒకే అర్థమును సూచించును గావున).

రాజససుఖముయొక్క లక్షణము - ప్రారంభమున అమృతతుల్యముగనుండి తుదకు విషప్రాయముగ పరిణమించుటయే యని 18వ అధ్యాయమున భగవానుడు చెప్పబోవుదురు - ''విషయేన్ద్రియ సంయోగా ద్యత్తదగ్రేఽమృతోపమమ్, పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్'' అని అట్లే ఈ రాజసాహారమున్ను ప్రారంభమున జనులకు ఇంపుగా తోచవచ్చును, కాని భుజించిన కొంతసేపటికి గొప్పదుఃఖమును, వ్యాకులత్వమును గలుగజేయును. నిత్యజీవితమున ఈ విషయమును పెక్కురు అనుభవించుచునే యున్నారు. మఱియు రజోగుణాత్మకమగు ఈ ఆహారమును భుజించువారికి ధ్యానమున్ను సరిగా జరుగదు. చిత్తము వికారవంతమై, చంచలమైయుండును. అత్తఱి కొద్దిసేపైనను మనస్సు నిశ్చలముగానుండదు. జంతువులలోగూడ రజోగుణాహారమగు మాంసాదులను భుజించు సింహము, పులి, ఎలుగుగొడ్డు, అతిచంచలములై క్రూరములై యుండును. తృణాదులను భుజించు గోవు, మేక మొదలైనవి సాత్త్వికచిత్తవృత్తి గలిగియుండును.

★ కట్వమ్లలవణాత్యుష్ణ - పాఠాన్తరము.

'ఆమయప్రదాః' - అని చెప్పుటవలన రాజసాహారము ఆరోగ్యమునుగూడ చెడగొట్టి వ్యాధులను గలుగజేయునని తెలియుచున్నది. కాబట్టి ఆరోగ్యభంగకరములును, దుఃఖ, శోకప్రదములును, ధ్యానప్రతిబంధకములునునగు అట్టి రాజసాహార పదార్థములను ముముక్షువు లెన్నడును గ్రహించరాదు. అట్టియాహారముపై ఎపుడైన ఇష్టము గలిగినచో తనయందింకను రజోగుణ మేకోశమందునో గలదని నిశ్చయించి దానిని తొలగద్రోయుటకై యత్నించవలెను.

'దాః' అని చెప్పక 'ప్రదాః' అని చెప్పుటవలన రోగాదుల నవి లెస్సగ గలుగజేయునని అర్థము.

ప్ర:– రాజసాహార మెట్టిది?

ఉ:– (1) చేదు, పులుపు, ఉప్పు, కారము వీనితో గూడినది (2) మిక్కిలి వేడిగా నున్నది (3) చమురులేనిది (4) మిగుల దాహమును గలుగుజేయునది.

ప్ర:– కావున ముముక్షు వేమి చేయవలెను?

ఉ:– ఆ యాహారమువలన కలుగు దుష్పరిణామమును మఱల మఱల భావించుచు దానిని త్యజించివేయవలెను.

అ॥ ఇక తామసాహారమెట్టిదో తెలుపుచున్నాడు -

10. యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్.

టీక:– యాతయామమ్ = వండినపిమ్మట ఒక జాముదాటినదియు (అనగా వండి చాల సేపైనదియు, లేక బాగుగ ఉడకనిదియు), గతరసమ్ = సారమునశించినదియు, పూతి = దుర్గంధముగలదియు, పర్యుషితం చ = పాచిపోయినదియు (వండినపిదప నొకరాత్రి గడచినదియు), ఉచ్ఛిష్టమ్ అపి = ఒకరు తినగా మిగిలినది (ఎంగిలిచేసినది) యు, అమేధ్యం చ = అశుద్ధముగా నున్నదియు, (భగవంతునకు నివేదింపబడనిదియు) అగు, యత్ = ఏ, భోజనమ్ = ఆహారము, (అస్తి = కలదో, తత్ = అది), తామసప్రియమ్ = తమోగుణముకలవారి కిష్టమైనది (అగును).

తా:– వండిన పిమ్మట ఒక జాము దాటినదియు (లేక బాగుగ ఉడకనిదియు), సారము నశించినదియు, దుర్గంధము గలదియు, పాచిపోయినదియు (వండిన పిదప ఒక రాత్రి గడిచినదియు), ఒకరు తినగా మిగిలినది (ఎంగిలిచేసినది) యు, అశుద్ధముగా నున్నదియు (భగవంతునకు నివేదింపబడనిదియు) అగు ఆహారము తమోగుణము గలవారి కిష్టమైనది యగును.

వ్యాఖ్య:– ఆరోగ్యశాస్త్రప్రకారమున్ను ఇట్టి తామసాహారము, పైనదెల్పిన రాజసాహారము నిషిద్ధములే యగును. సారము నశించి పాచిపోయినట్టి పదార్థమును తినినచో మలినమైన ఆహారపదార్థములయొక్క అణువులు శరీరమున ప్రవేశించి రక్తమును చెడగొట్టి అనారోగ్యమును గలుగజేయుటయేగాక వాని సూక్ష్మాంశములు మనస్సునందు ప్రవేశించి అద్దానినిగూడ మలిన మొనర్చును. కాబట్టి ముముక్షువు లట్టి యాహారముల నెన్నడును సేవించరాదు.

అ॥ ఇక యజ్ఞములనుగూర్చి చెప్పబోవుచు మొట్టమొదట సాత్త్విక యజ్ఞము యొక్క లక్షణములను వివరించుచున్నాడు -

11. అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే
యష్టవ్యమేవేతి మన స్సమాధాయ స సాత్త్వికః.

టీక:– యష్టవ్యమ్ ఏవ = చేయదగినదే, ఇతి = అని, మనః = మనస్సును, సమాధాయ = సమాధానపఱచి, విధిదృష్టః = శాస్త్రసమ్మతమగు, యః యజ్ఞః = ఏ యజ్ఞము, అఫలాకాంక్షిభిః = ఫలాపేక్షలేనివారిచేత, ఇజ్యతే = చేయబడుచున్నదో, సః = అది, సాత్త్వికః = సాత్త్వికమైనది, (భవతి = అగుచున్నది).

తా:– 'ఇది చేయదగినదియే' యని మనస్సును సమాధానపఱచి శాస్త్రసమ్మతమగు ఏ యజ్ఞము ఫలాపేక్షలేనివారిచేత చేయబడుచున్నదో అది సాత్త్వికయజ్ఞమనబడును.

వ్యాఖ్య:– ప్రతివాడును తానుచేయు కార్యము శాస్త్రసమ్మతమైనదో, కాదో బాగుగ విచారించుకొని శాస్త్రవిరుద్ధమైనదానిని త్యజించివేసి శాస్త్రసమ్మతమైన దానినే గ్రహించవలెను. కనుకనే 'విధిదృష్టః' అని చెప్పబడినది. మఱియు 'ఇది చేయదగినది' యను కర్తవ్యబుద్ధి అద్దానియందు లెస్సగనుంచుకొని ఫలాపేక్షలేక అద్దాని నాచరించవలెను. అపుడది సాత్త్వికకార్యమై చెన్నొందును. ఇచట యజ్ఞమని చెప్పబడినదాని యర్థము పశుహింసాదులతోగూడిన యాగములనికాదు. భగవద్ధ్యానము, పరోపకారము, దైవసంబంధమైనకార్యములు మున్నగునవి, లేక యే సత్కార్యమైనను - అనియే యగును.

'మనః సమాధాయ' - అని చెప్పబడినందువలన, ప్రతివారును తాము కార్యమును ప్రారంభించుటకు ముందుగా మనస్సును బాగుగ కుదుటపఱచుకొని సంశయములకు తావీయక నిశ్చయబుద్ధితో నద్దాని నుపక్రమించవలెనని తెలియుచున్నది. మనస్సును సమాధానపఱచక, నిశ్చలపఱచక, ఆరంభింపబడు ఏ కార్యమున్ను చక్కగ జరుగదు. కావున చేయబోవు కార్యముయొక్క బాగోగులను బాగుగ నిర్ణయించుకొని శాస్త్రాదులద్వారా, ఆప్తవాక్యములద్వారా నిశ్చయమునకువచ్చి మనస్సును స్థిరపఱచుకొని నిష్కామబుద్ధితో అట్టి శాస్త్రసమ్మతకార్యము నాచరించినచో అద్భుతఫలితముల నొసంగగలదు. అదియే సాత్త్వికకార్యము, సాత్త్వికయజ్ఞము నగును.

ప్ర:– సాత్త్వికయజ్ఞ మెట్టిది?

ఉ:– (1) శాస్త్రోక్తమైనదియు (2) ఫలాపేక్షరహితముగ చేయబడునదియు (3) . ఇదిచేయదగినది. అని మనస్సును సమాధానపఱచుకొని మనుజునిచే నాచరింపబడునదియు సాత్త్వికయజ్ఞమనబడును.

అ॥ రాజసయజ్ఞమును గూర్చి తెలుపుచున్నాడు -

12. అభిసన్ధాయ తు ఫలం దమ్భార్థమపి చైవ యత్
ఇజ్యతే భరతశ్రేష్ఠ తంయజ్ఞం విద్ధి రాజసమ్.

టీక:– భరతశ్రేష్ఠ = భరతవంశశ్రేష్ఠుడవగు ఓ అర్జునా!, ఫలమ్ = ఫలమును, అభిసన్ధాయతు = అపేక్షించియు, దమ్భార్థమ్ అపి చ ఏవ = డంబము కొఱకును, యత్ = ఏది, (ఏ యజ్ఞము), ఇజ్యతే = చేయబడుచున్నదో, తం యజ్ఞమ్ = ఆ యజ్ఞమును, రాజసమ్ = రాజసమైనదానినిగా, విద్ధి = తెలిసికొనుము.

తా:– భరతవంశశ్రేష్ఠుడవగు ఓ అర్జునా! ఫలమునుగోరియు, డంబముకొఱకును గావింపబడు యజ్ఞమును రాజసమైనదానినిగా నీవు తెలిసికొనుము.

వ్యాఖ్య:– ఫలమునుగోరి చేయబడు కర్మచే చిత్తశుద్ధి యెన్నటికిని కలుగనేరదు. చిత్తము శుద్ధముకానిచో ఆత్మతత్త్వము ప్రకాశింపదు (అనుభూతముకాదు). కావున అట్టి ఫలాభిసంధియుక్తమగు కర్మ ఇచట రాజసమని (కావుననే త్యాజ్యమని) చెప్పబడినది. మఱియు కేవలము పేరుప్రఖ్యాతులకొఱకు, వేషముకొఱకు, డంబము కొఱకు చేయబడు కార్యమున్ను రాజసమేయని యిట పేర్కొనబడినది. కాబట్టి వానినెవరును ఆశ్రయించరాదు.

ప్ర:– రాజసయజ్ఞ మెట్టిది?

ఉ:– (1) ఫలాభిలాషతోను (2) డంబముకొఱకును గావింపబడు యజ్ఞము రాజసమని చెప్పబడును.

అ॥ తామసయజ్ఞము చెప్పబడుచున్నది –

13. విధిహీనమసృష్టాన్నం మన్త్రహీనమదక్షిణమ్
శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే.

టీక:– విధిహీనమ్ = శాస్త్రవిధిననుసరింపనిదియు, అసృష్టాన్నమ్ = అన్నదానములేనిదియు, మన్త్రహీనమ్ = మంత్రరహితమైనదియు, అదక్షిణమ్ = దక్షిణలేనిదియు, శ్రద్ధావిరహితమ్ = శ్రద్ధ బొత్తిగ లేనిదియునగు, యజ్ఞమ్ = యజ్ఞమును, తామసమ్ = తామసమని, పరిచక్షతే = చెప్పుచున్నారు.

తా:– విధ్యుక్తము కానిదియు, అన్నదానము లేనిదియు, మంత్రరహితమైనదియు, దక్షిణలేనిదియు, శ్రద్ధ బొత్తిగలేనిదియునగు యజ్ఞము తామసయజ్ఞమని చెప్పబడును.

వ్యాఖ్య:– 'అసృష్టాన్నమ్' – అన్నదానమనునది అనుష్ఠానవేదాంతముయొక్క ఒకానొక స్వరూపము. సర్వభూతములందును పరమాత్మకలడను సత్యము ననుభూత మొనర్చుకొనినవాడు పరోపకారము తప్పక చేయును. అదియే ఆచరణవేదాంతము. అందువలననే కాబోలు అన్నిపుణ్యకార్యములందును శ్రాద్ధాదులందును, యజ్ఞములందును అన్నదానమును పెద్దలు విధించిరి. తనవలె ఎల్లప్రాణులను చూచునట్టి గొప్పసాధన ఈ అన్నదానకార్యమువలన లెస్సగ అనుభవమునకు రాగలదు. కావున ఇట్టి పవిత్రమగు అంగము కొఱతపడిన యజ్ఞము తామసమేయని భగవానుడు పలికిరి.

'అదక్షిణమ్' – ఇదియు పైనదెల్పిన అన్నదానమును బోలినదే. తనసొత్తులో కొంతభాగమును ఋత్విక్కులకు, బీదలకు, దరిద్రనారాయణులకు దక్షిణగా నొసంగవలెను. ఇది త్యాగమునకు చిహ్నము. కావున ఇట్టి త్యాగభావములేని యజ్ఞము తామసమైనదని గీతాచార్యులు పేర్కొనిరి.

'శ్రద్ధావిరహితమ్' - ఏ కార్యమునైనను శ్రద్ధతో, భక్తితో పరిపూర్ణవిశ్వాసముతో చేయబడినపుడే ఉత్తమఫల మొసంగగలదు. శ్రద్ధలేకుండ చేయబడు కార్యము చేయని దానితో సమానమేయని ఈ అధ్యాయముననే మున్ముందు భగవానుడు చెప్పబోవుదురు. (అశ్రద్ధయా హుతం - అసదిత్యుచ్యతే...) కావున శ్రద్ధారాహిత్యమును, తామసప్రవృత్తిని విడనాడి జనులు శ్రద్ధాసమన్వితులైయే సమస్తకార్యములను ఆచరించి ఉత్తమఫలములను బొందవలయును.

ప్ర:– తామసయజ్ఞ మెట్టిది ?

ఉ:– (1) శాస్త్రోక్తముకానిది (2) అన్నదానములేనిది (3) మంత్రరహితమైనది (లేక మంత్ర లోపములు గలది) (4) దక్షిణలు లేనిది (5) శ్రద్ధతో చేయబడనిది - తామసయజ్ఞమనబడును.

అ॥ ఇక శారీరక, వాచిక, మానసిక తపస్సులను చెప్పబోవుచు ముందుగా శారీరక తపస్సునుగూర్చి వర్ణించుచున్నాడు -

14. దేవద్విజగురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే.

టీక:– దేవద్విజగురుప్రాజ్ఞపూజనమ్ = దేవతలను, బ్రహ్మనిష్ఠులను, గురువులను, జ్ఞానులను (బ్రహ్మజ్ఞానముకల పెద్దలను) పూజించుట, శౌచమ్ = బాహ్యాభ్యంతరశుద్ధిగలిగియుండుట, ఆర్జవమ్ = ఋజుత్వముతో గూడియుండుట (కౌటిల్యము లేకుండుట, మనోవాక్కాయములచే ఏకరీతిగా ప్రవర్తించుట), బ్రహ్మచర్యమ్ = బ్రహ్మచర్యవ్రతమును పాలించుట, అహింసా చ = ఏ ప్రాణిని హింసించకుండుటయు, శారీరమ్ = శరీరసంబంధమైన, తపః = తపస్సని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా:– దేవతలను, బ్రహ్మనిష్ఠులను, గురువులను, జ్ఞానులను (మహాత్ములను, బ్రహ్మజ్ఞానముగల పెద్దలను) పూజించుట, బాహ్యాభ్యంతరశుద్ధిగలిగియుండుట, ఋజుత్వముతోగూడియుండుట (కుటిలత్వము లేకుండుట, మనోవాక్కాయములతో ఏకరీతిగ వర్తించుట), బ్రహ్మచర్యవ్రతమును పాలించుట, ఏ ప్రాణిని హింసింపకుండుట, శారీరక (శరీరసంబంధమైన) తపస్సని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– శారీరక, వాచిక, మానసికములను త్రివిధతపస్సులను గూర్చి చెప్పబడిన ఈ ఘట్టము (14, 15, 16 శ్లోకములు) చాలముఖ్యమైనది. సాధకులు ఈ మూడువిధములైన తపస్సులను చక్కగ శీలించి త్రికరణశుద్ధులైయుండినచో నిర్మల దర్పణమున ప్రతిబింబమువలె, ఆత్మానుభూతి వారికి సులభముగ లభ్యముకాగలదు. ఈ అధ్యాయమున ఆహారము, యజ్ఞము, దానము అనువానిని గూర్చి చెప్పునపుడు వానియొక్క సాత్త్విక, రాజస, తామసరూపములనే పేర్కొని, ఒక్క తపస్సునుగూర్చి వర్ణించునపుడు మాత్రము, అద్దాని సాత్త్విక, రాజస, తామసరూపములనేగాక, తత్సంబంధమైన శారీరక, వాచిక, మానసిక తపస్సులనుగూడ వక్కాణించిరి. ఉపాధియందలి (ఇంద్రియాదులందలి) మాలిన్యములను బాగుగ తపింపజేసి వానిని తొలగించుటయే తపస్సు. అదియే మోక్షమునకు హేతువు. పరమార్థసాధనలలో అదిచాల ప్రధానమైనది. అందువలననే కాబోలు గీతాచార్యులు తపస్సును గుఱించి చెప్పునపుడు అన్నిటి వలె సామాన్యముగ చెప్పక ప్రత్యేకించి మఱల మూడువిధములుగ చెప్పిరి. జనులలో కొందఱు తపస్సను మాట వినగనే భీతిల్లుచుందురు. ఎండలో, వానలో బాధ జెందుటయే తపస్సని వారిభావము. కాని శ్రీకృష్ణపరమాత్మ

తపస్సునుగూర్చి యిచట గావించిన వివరణమును, వ్యాఖ్యను పరిశీలించినచో ఇక వారట్టి భీతిజెందనవసరములేదని స్పష్టముకాగలదు. భయంకరములైన తపస్సులను గూర్చిన ప్రస్తావనయే ఇచట లేదు. కాబట్టి సులభసాధ్యములై, సర్వులకును ఆచరణయోగ్యములైనట్టి ఈ త్రివిధతపస్సులను ప్రతివారును స్త్రీలును, పురుషులును చక్కగ ఆచరించి శరీర వాఙ్మనంబులను శుద్ధమొనర్చుకొని మోక్షభాగులు కావలయును.

ఈ శ్లోకమునందు శారీరక (శరీరసంబంధమైన) తపస్సు చెప్పబడినది. ఇందు ఐదు సాధనలు వచింపబడినవి. (1) మొట్టమొదట పెద్దలసేవనము, పూజనము పేర్కొనబడినది (దేవద్విజగురుప్రాజ్ఞ పూజనమ్). పెద్దలను, బ్రహ్మనిష్ఠులను పూజించుటవలన, సేవించుటవలన రెండు మహత్తర సత్ఫలితములు సాధకునకు కలుగగలవు. అవియేవియనిన - (1) వారియొక్క అనుగ్రహము లభించుట (2) తనయొక్క అహంకారము, అభిమానము శమించుట. అధ్యాత్మమార్గమున సర్వేశ్వరుని యొక్కయు, సద్గురుని యొక్కయు, మహాత్ములయొక్కయు అనుగ్రహములేనిచో దుస్తరమగు మాయ ఎవరికిని దారి నొసంగదు. ప్రతిబంధకములు తొలగవు. అత్తఱి జనులు పరమార్థరంగమున ముందుకు జనుట చాలకష్టము. కాబట్టి వారియొక్క పూజా, సేవాదులచేతను, వారియెడల వినయవిధేయతలను జూపుటవలనను, వారి యనుగ్రహమును, ఆశీర్వాదమును ఎట్లైన సంపాదించవలెను. వారి కటాక్షము ముముక్షువులకు అపారమగు మేలును చేకూర్చగలదు. ఇంతియేకాదు. పెద్దలను సేవించుటవలన మనుజునకు తనయందలి అహంకారము, గర్వము, అభిమానము శీఘ్రముగ శమించిపోగలదు. కాబట్టి ముముక్షువున కీ సాధన చాల అవసరమైయున్నది. అందులకే కాబోలు భగవానుడు మొట్టమొదట దానినే వక్కాణించిరి.

'ద్విజ' - ద్విజులనగా రెండవజన్మయెత్తినవారు; అనగా పుట్టుకతో వచ్చిన జన్మకాక, సంస్కారముచే, సాధనచే వచ్చిన రెండవజన్మకలవారని అర్థము. అజ్ఞానమును ఛేదించి, లేక అజ్ఞానముతో గూడిన పాతశరీరమనంబులను పొందినవారని భావము. వారి జీవితము పూర్వజీవితమువలె నుండదు. వారియందు బ్రహ్మతేజస్సు ప్రకాశించుచుండును.

'ప్రాజ్ఞ' - ప్రజ్ఞకలవాడు ప్రాజ్ఞుడు. జ్ఞానియని అర్థము. 'ప్రజ్ఞానం బ్రహ్మ' అను మహావాక్యమందు తెలుపబడిన బ్రహ్మరూపమగు ప్రజ్ఞను, చిద్వస్తువును ఎఱుంగువారే ప్రాజ్ఞులనియు చెప్పవచ్చును. అట్టి ప్రాజ్ఞులను, మహనీయులను సత్కరించుట, పూజించుట ఒక విధమైన తపస్సనియే ఇట చెప్పబడినది.

'శౌచమ్' - మనశ్శుద్ధి, శరీరశుద్ధి, పరిసరశుద్ధి - మూడును అవసరములే. తన మనస్సు, తన శరీరము, తానుండుచోటు - మూడిటిని శుద్ధముగా నుంచుకొనవలెను. మురికితావులందుండువారికి ఆరోగ్యము చెడుటయేగాక 'మురికి' భావనలుగూడ గలుగుచుండును. మలినశరీరముగలవానికి స్వాస్థ్యము చెడుటచే నిష్ఠకు విఘ్నములు కలుగును. ఇక మలినమనస్సుగలవారికి అసలు దైవమార్గమే గోచరింప కుండును. కాబట్టి సాధకుడు కడుజాగరూకుడై శుచిత్వమును లెస్సగ సంపాదించవలెను. ఊడ్చిశుద్ధము చేయుటద్వారా పరిసరములను, స్నాన సాత్త్వికాహారాదులద్వారా శరీరమును, మలినసంకల్పత్యాగము ద్వారా, దైవసంకల్పములను చేయుటద్వారా మనస్సును శుచివంతముగ గావించుకొనవలెను.

'ఆర్జవమ్' - ఋజుత్వము - కుట్ర, కపటము, కౌటిల్యము లేకుండుట - పామువలె వక్రత గలిగియుండువానియందు విషము (పాపము, అజ్ఞానము) ఉండియేయుండును. కావున తలంపునందు, వాక్కునందు, క్రియయందు ఒకే విధమైన ప్రవర్తన గలిగియుండవలెను. శరీరవాఙ్మనంబులలో ఏకరీతివర్తింపవలయును. 'వక్ర' వ్యవహారము మానవలెను.

'బ్రహ్మచర్యమ్' - త్రికరణములతో బ్రహ్మచర్యమును శీలించుట ఒక మహాతపస్సని భగవానుడు చెప్పుచున్నాడు. బ్రహ్మచర్యమనగా విషయదోషము, కామభావన, కామవ్యవహారము లేకుండుట; మఱియు బ్రహ్మమును గూర్చి చింతించుట. అన్ని సాధనలకును బ్రహ్మచర్యము పునాదివంటిది. కనుకనే గీతలో భగవాను డచటచట అద్దానిని ప్రోత్సహించుచువచ్చిరి. దీనివిషమై అశ్రద్ధవహించినచో మనుజుడు పరమార్థపథమున ఉన్నతిని బడయజాలడు. అధ్యాత్మసౌధమున బ్రహ్మచర్యము కీలకస్థానము నాక్రమించు కొనియున్నది (Main - Switch).

'అహింస' - శరీరవాఙ్మనంబులచే ఏ ప్రాణికిని అపకారము చేయకుండుట. (అజ్ఞానముగలిగి యున్నచో తన ఆత్మను తాను హింసించుకొనినట్లగును. గావున అజ్ఞానమును తొలగించి, జ్ఞానసముపార్జనము గావించుటద్వారా ఆత్మహింసను త్యజించుటయు అహింసయే యగును. అయితే యిది అహింసయొక్క మహోన్నతమగు రూపమని యెఱుంగవలెను).

ప్ర:– శరీరతపస్సనగా నేమి ?

ఉ:– (1) దేవతలు, గురువులు, బ్రహ్మనిష్ఠులు, ప్రాజ్ఞులగు మహనీయులు (జ్ఞానులు, పెద్దలు) - వీరిని పూజించుట (2) బాహ్యాభ్యంతరశుచిత్వము (3) ఋజుత్వము (4) బ్రహ్మచర్యము (5) అహింస - వీనిని గలిగియుండుట శరీరతపస్సని చెప్పబడును.

అ॥ వాచికతపస్సును గూర్చి చెప్పుచున్నాడు -

**15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే.**

టీక:– అనుద్వేగకరమ్ = ఇతరుల మనస్సునకు బాధగలిగింపనిదియు, సత్యమ్ = సత్యమైనదియు, ప్రియహితమ్ చ = ప్రియమైనదియు, మేలుగలిగించునదియు (అగు), వాక్యమ్ = వాక్యమున్ను, స్వాధ్యాయాభ్యసనమ్ చ ఏవ = వేదాదులయొక్క అధ్యయనమును అభ్యసించుట (వేదము, ఉపనిషత్తులు, భగవద్గీత, భారతము, భాగవతము, రామాయణము, యోగవాసిష్ఠము మున్నగువానిని అధ్యయనముచేయుట, ప్రణవాది మంత్రములను జపించుట), యత్ = ఏదికలదో. (తత్ = అది), వాఙ్మయమ్ = వాక్కునకి సంబంధించిన (వాచిక), తపః *(ఇతి)* = తపస్సని, ఉచ్యతే చెప్పబడుచున్నది.

తా:– ఇతరుల మనస్సునకు బాధగలిగింపనిదియు, సత్యమైనదియు, ప్రియమైనదియు, మేలు గలిగించునదియునగు వాక్యమును, వేదాదులయొక్క అధ్యయనమును అభ్యసించుట★ (వేదము, ఉపనిషత్తులు, భగవద్గీత, భారతము, భాగవతము, రామాయణము, యోగవాసిష్ఠము మున్నగువానిని అధ్యయనముచేయుట, ప్రణవాది మంత్రములను జపించుట) వాచిక తపస్సని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– 'అనుద్వేగకరం వాక్యమ్' - ఉచ్చరింపబడు వాక్యము పరుల మనస్సునకు నొప్పిగలుగజేయరాదు. మఱియు అది సత్యమై (యథార్థమై) యుండవలెను. సత్యవాక్కు అయినప్పటికిని దానిని పరుషముగ, అప్రియముగ పలుకరాదు. ఇతరులకు ప్రియముగ, హితముగ నుండవలెను.

★వేదాన్త శతరుద్రీయప్రణవాది జపం బుధాః
సత్త్వశుద్ధికరం పుంసాం స్వాధ్యాయం పరిచక్షతే.

'స్వాధ్యాయాభ్యసనమ్' - 'అభ్యసనమ్' అని చెప్పినందువలన అట్టి స్వాధ్యాయమును లెస్సగ అభ్యాసము చేయవలెనని, ప్రతిరోజు దానిని సాధించవలెనని స్పష్టమగుచున్నది. 'ధ్యానముగదా ప్రధానము, శాస్త్రాభ్యాసమెందులకు?' అని పలుకువారి కిచట చక్కని సమాధానమును భగవాను డొసంగిరి. ధ్యానమే ముఖ్యమైనప్పటికిని విరామసమయములందు శాస్త్రాదులను పరిశీలించుట, అధ్యయనముచేయుట, నిప్పుకు గాలితోడైనట్లు, అతని ధ్యానాదులకు చాల సహాయకారిగానుండునని యెఱుంగవలెను. ఇట్టి అధ్యయనము చేతను, ప్రణవాదిమంత్రముల జపముచేతను, సత్యవాక్కుచేతను వాక్ - శుద్ధియు కలుగగలదు.

ప్ర:- వాచికతపస్సు అనగా నేమి?

ఉ:- (1) పరులకు **నొప్పిగలుగజేయనిదియు,** సత్యమైనదియు, ప్రియముగను, హితముగ నుండునదియునగు వాక్కున్ను (2) వేదాదుల అధ్యయనమున్ను వాచికతపస్సని చెప్పబడును.

అ॥ ఇక మానసిక తపస్సును గూర్చి వచించుచున్నాడు -

16. మనః ప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః
భావసంశుద్ధిరిత్యేత త్తపో మానసముచ్యతే.

టీక:- మనః ప్రసాదః = మనస్సును నిర్మలముగా నుంచుట (కలతనొందనీయక స్వచ్ఛముగానుంచుట), సౌమ్యత్వమ్ = ముఖప్రసన్నత్వము (క్రూరభావము లేకుండుట), మౌనమ్ = భగవంతుని గూర్చిన, సత్ప్రవర్తననుగూర్చిన మననము గలిగియుండుట, అనగా ఆత్మధ్యానాదులందు చిత్తమును నిలుపుట (లేక దృశ్యసంకల్పము లెవ్వియులేక ఆత్మయందే స్థితిగలిగియుండుట అను వాఙ్మౌనసహిత మనోమౌనము), ఆత్మవినిగ్రహః = మనస్సును లెస్సగ నిగ్రహించుట, భావసంశుద్ధిః = పరిశుద్ధమగు భావము గలిగియుండుట (మోసము మున్నగునవి లేకుండుట), ఇతి ఏతత్ = అనునివి, మానసమ్ = మనస్సంబంధమైన, తపః = తపస్సని, ఉచ్యతే = చెప్పబడుచున్నది.

తా:- మనస్సును నిర్మలముగానుంచుట (కలతనొందనీయక స్వచ్ఛముగానుంచుట), ముఖప్రసన్నత్వము (క్రూరభావము లేకుండుట), పరమాత్మనుగూర్చిన మననము (దైవధ్యానము) గలిగియుండుట (లేక, దృశ్యసంకల్పము లెవ్వియు లేక ఆత్మయందే స్థితిగలిగియుండుట, అను వాఙ్మౌనసహిత మనోమౌనము), మనస్సునుబాగుగ నిగ్రహించుట, పరిశుద్ధమగు భావము గలిగియుండుట (మోసము మున్నగునవి లేకుండుట) అనునివి మానసిక తపస్సని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:- 'మనః ప్రసాదః' - మనస్సు తేటగా, నిర్మలముగా, కలతనొందకుండనుండవలెను. మనస్సునందు. రజోగుణ, తమోగుణములయొక్క సంపర్కమున్నచో, అదిచంచలముగానో, మత్తుగానో యుండును. కావున సత్త్వగుణమును, విశుద్ధసత్త్వగుణము నాశ్రయించి మనస్సును నిర్మలముగా నుంచుకొనవలెను. చిల్లగింజ అరగదీసి నీటిలోకలిపినచో మురికియంతయు క్రిందకుజని నీరు తేటగానుండునట్లు, భక్తి జ్ఞాన వైరాగ్యదులచే మనోమాలిన్యమును రహితమొనర్చి చిత్తమును వినిర్మలముగా జేయవలెను. ఇదియే మనఃప్రసాదము, మానసిక తపస్సు. ఇట్టి మనఃప్రసాదమును స్వీకరించినవాడు మఱల బంధమును బొందనేరడు.

'సౌమ్యత్వమ్' - అంతఃకరణవృత్తి సామాన్యముగ ముఖమునందు ప్రతిబింబించుచుండును. ముఖము సౌమ్యముగా, వికాసముగానున్నచో దానినిబట్టి చిత్తవృత్తియు నిర్మలముగా, నిశ్చలముగా, సౌమ్యముగా నున్నదని ఊహించవచ్చును. అట్టి సౌమ్యస్థితి గలిగియుండుటయు మానసిక తపస్సేయగును.

'మౌనమ్' - 'వాఙ్మౌనము, మనోమౌనము' అని మౌనము రెండు విధములు. ఇచట మౌనమును మానసిక తపస్సునందు జెప్పుటవలన మానసిక మౌనమే ఇచటవివక్షితమని తెలియుచున్నది. అయితే వాఙ్మౌనము మనోమౌనమునకు సహాయకారిగా నుండగలదు. కాబట్టి అదియు నభ్యసించవలసినదే. అయితే మనోమౌనమునకై యత్నింపక కేవలము వాఙ్మౌనముమాత్రము గలిగియున్నచో అత్తఱి మనస్సు అనేక సంకల్పములతో గూడుకొని చంచలమైయుండుటవలన - ఆ మౌనమువలన ఎక్కువ ప్రయోజనముండదని ఈ సందర్భమున గ్రహించవలసియున్నది. మౌనమునకు ముఖ్యార్థము మనోవృత్తుల నిశ్చలత్వము, దృశ్యసంకల్పరాహిత్యమేయగును. కనుకనే మౌనమును భగవానుడు వాచిక తపస్సులో చేర్చక మానసిక తపస్సులో చేర్చుట సంభవించినది. కాబట్టి మనోమౌనమే సర్వులకును ముఖ్యమైనదనియు, వాఙ్మౌనము దానికి సహాయభూతముగ నుండుననియు నెఱుంగవలెను.

'ఆత్మవినిగ్రహః' - ఇచట 'ఆత్మ' అను పదమునకు మనస్సని, ఇంద్రియములని యర్థము. నిగ్రహమని చెప్పక వినిగ్రహమని చెప్పుటవలన సామాన్యనిగ్రహము చాలదనియు, ఇంద్రియ మనంబులను లెస్సగ నిగ్రహించవలెననియు తేలుచున్నది. అట్లే 'భావసంశుద్ధి' అను పదమునందును, శుద్ధి అని చెప్పక 'సంశుద్ధి' అని చెప్పుటవలన భావమందు పరిపూర్ణమగు శుద్ధత్వము గలిగియుండవలెనని స్పష్టమగుచున్నది. జ్ఞానసిద్ధికి భావశుద్ధి అవసరము. అనగా ఆత్మానుభూతికి భావనిర్మలత్వము అత్యంతావశ్యకమైయున్నది. నిర్మలజలమందు సూర్యుడు దేదీప్యమానముగ ప్రకాశించునట్లు శుద్ధహృదయమున ఆత్మభాస్కరుడు చక్కగ భాసించును. కాబట్టి మనస్సునందు, భావములందు ఏలాటి దృశ్యదోషము, అపవిత్రత చేరకుండ బహుజాగరూకతతో జూచుచుండవలెను.

ప్ర:- మానసికతపస్సు అనగా నేమి?

ఉ:- (1) మనస్సు నిర్మలముగా నుండుట (2) ముఖమందు ప్రసన్నత్వము గలిగియుండుట (3) మౌనము (ఆత్మనుగూర్చిన మననము, లేక దృశ్యవృత్తిరాహిత్యపూర్వకమగు ఆత్మస్థితి) - అనునవి మానసిక తపస్సని చెప్పబడును.

అ|| ఇంతదనుక శారీరక, వాచిక, మానసిక తపస్సులనుగూర్చి చెప్పి, ఇక సాత్త్విక, రాజసిక, తామసిక తపస్సులను వివరించుచున్నాడు -

17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః
అఫలాకాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరిచక్షతే.

టీక:- అఫలాకాఙ్క్షిభిః. = ఫలాపేక్షలేనివారును, యుక్తైః = నిశ్చలచిత్తులును (లేక దైవభావనతోగూడియున్నవారును) అగు, నరైః = మనుజులచే, పరయా = అధికమైన, శ్రద్ధయా = శ్రద్ధతో, తప్తమ్ = ఆచరింపబడినదైన, తత్ త్రివిధమ్ = (పైనతెలుపబడిన) ఆ మూడువిధములైన, తపః = తపస్సును, సాత్త్వికమ్ = సాత్త్వికమైనదిగా, పరిచక్షతే = (పెద్దలు) చెప్పుచున్నారు.

తా:– ఫలాపేక్షలేనివారును, నిశ్చలచిత్తులును (లేక, దైవభావనాయుక్తులును) అగు మనుజులచే అధికమగు శ్రద్ధతో ఆచరింపబడినట్టి ఆ (పైనదెలిపిన శారీరక, వాచిక, మానసికములను) మూడు విధములైన తపస్సును సాత్త్వికమని (సాత్త్వికతపస్సని) (పెద్దలు) చెప్పుచున్నారు.

వ్యాఖ్య: – 'శ్రద్ధయా' అను పదమునకు 'పరయా' అను విశేషణమును చేర్చుట వలన సామాన్యశ్రద్ధ చాలదనియు, మిక్కుటమైన శ్రద్ధ, లేక ఉత్తమమైనశ్రద్ధ అవసరమని విదితమగుచున్నది. ఏలయనగా సాధకునకు మధ్యమధ్య ఏవైన అంతరాయములు గలిగినచో అల్పమగు శ్రద్ధ చలించిపోవచ్చును. అందుచే అపరిమితమగు శ్రద్ధతో, విశ్వాసముతో, పట్టుదలతో గూడుకొనియున్నప్పుడు మాత్రమే మాయను దాటవీలగును.

'నరైః' - ఇచట నరులు అని చెప్పబడినదే కాని జాతిమతకులాదు లెవ్వియు పేర్కొన బడలేదు. కావున మానవులందఱును పరమార్థలక్ష్యమును సాధించుటకు, భగవంతుని అన్వేషించుటకు అర్హులేయని గీతాచార్యులు తేల్చిచెప్పివైచిరి.

'యుక్తైః' - భగవంతునితో, ఆత్మతత్త్వముతో, పరమార్థసాధనతో కూడిక (యోగము) కలవారు, ప్రాపంచికదృశ్యజాలముతో కూడిక తగ్గించుకొని, భగవద్ధ్యానపరులై యుండువారు, నిశ్చలచిత్తులు యుక్తులనబడుదురు.

దీనినిబట్టి సాత్త్వికతపస్సు నాచరించువారు మూడు సద్గుణములు గలిగియుండవలెనని తేలుచున్నది. అవి యేవియనిన - (1) వారు పరమశ్రద్ధతో గూడియండవలెను (2) ఫలమును గోరక కర్మలనుచేయవలెను (3) నిశ్చలచిత్తము, లేక భగవద్ధ్యానపరత్వము గలిగియుండవలెను - ఇట్టి ఉత్తమ స్వభావములు గలిగి పైనదెల్పిన త్రివిధ (శారీరక, వాచిక, మానసిక) తపస్సుల నాచరించుచో అది సాత్త్విక తపస్సనబడును.

ప్ర:– సాత్త్వికతపస్సనగా నెట్టిది?

ఉ:– (1) అత్యంతశ్రద్ధతో (2) ఫలాభిలాషారహితముగ (3) నిశ్చలచిత్తుడై (లేక, దైవధ్యానపరుడై) పైన దెలిపిన త్రివిధతపస్సులను చేయుటయే సాత్త్వికతపస్సనబడును.

అ॥ రాజసిక తపస్సునుగూర్చి చెప్పుచున్నాడు –

18. సత్కారమానపూజార్థం తపో దమ్భేన చైవ యత్
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్.

టీక:– సత్కారమానపూజార్థమ్ = ఇతరులచే తాను సత్కరింపబడవలెనని, గౌరవింపబడవలెనని, పూజింపబడవలెనని, దమ్భేన చ ఏవ = డంబముతో మాత్రమే, యత్ = ఏ, తపః = తపస్సు, క్రియతే = చేయబడుచున్నదో, తత్ = అది, చలమ్ = అస్థిరమై, అధ్రువమ్ = అనిశ్చితమైనట్టి ఫలముగలదై, రాజసమ్ = రాజసతపస్సని, ఇహ = ఈ ప్రపంచమందు, ప్రోక్తమ్ = చెప్పబడినది.

తా:– ఇతరులచే తాను సత్కరింపబడవలెనని, గౌరవింపబడవలెనని, పూజింపబడవలెనని డంబముతోమాత్రమే చేయబడు తపస్సు అస్థిరమై, అనిశ్చితమైనట్టి ఫలముగలది (లేక చపలమైనట్టి రూపముగలది) ఈ ప్రపంచమున రాజసిక తపస్సు అని చెప్పబడినది.

వ్యాఖ్య:– కొందఱు తమ తపస్సునుజూచి ఇతరులు తమ్ము సత్కరించెదరను భావముతో తపస్సుచేయ నారంభింతురు. అది సదుద్దేశ్యముతోను, హృదయపూర్వకముగను స్థిరమైయుండదు. దాని ఫలితమున్ను అట్లే చపలముగ, అనిశ్చితముగ నుండును. కావున విజ్ఞులిద్దాని ననుసరించరాదు.

ప్ర:– రాజసతపస్సు ఎట్టిది?

ఉ:– సత్కారమానపూజాదులకొఱకై డంబముతో చేయబడునది రాజసతపస్సనబడును.

ప్ర:– అది యెట్టి ఫలితము గలిగియుండును? ఎట్టి స్వరూపము గలిగియుండును?

ఉ:– అస్థిరమై, అనిశ్చితమైనట్టి ఫలము గలిగియుండును. చంచల, అనిశ్చితస్వరూపము గలిగియుండును.

అ|| ఇక తామసిక తపస్సును గుఱించి తెలుపుచున్నాడు -

19. మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః
పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్.

టీక:– యత్ తపః = ఏ తపస్సు, మూఢగ్రాహేణ = మూర్ఖపు పట్టుదలతో, ఆత్మనః పీడయా = తన శరీరమును (శుష్కోపవాసాదులచే) బాధించుకొనుటచేగాని, పరస్య = ఇతరునియొక్క, ఉత్సాదనార్థం వా = నాశముకొఱకుగాని, క్రియతే = చేయబడుచున్నదో, తత్ = అది, తామసమ్ = తామస తపస్సని, ఉదాహృతమ్ = చెప్పబడినది.

తా:– మూర్ఖపుపట్టుదలతో తన శరీరమును (శుష్కోపవాసాదులచే) బాధించుకొనుటద్వారాగాని, లేక ఇతరులను నాశనముచేయవలెనను ఉద్దేశ్యముతోగాని చేయబడు తపస్సు తామసిక తపస్సని చెప్పబడినది.

వ్యాఖ్య:– 'మూఢగ్రాహేణ' - (మూర్ఖపుపట్టుదలతో) - పట్టుదల మంచిదేకాని అది వివేకముతో గూడినపుడే సత్ఫలముల నొసంగగలదు. మూర్ఖపుపట్టుదలల వలన ప్రయోజనములేదు.

'ఆత్మనో యత్పీడయా' - కొందఱు మూర్ఖపు పట్టుదలతో శుష్కోపవాసాదుల ద్వారా తమ శరీరమును బాధించుకొనుచు తపస్సు చేయుదురు. తపస్సుగాని, ఉపవాసముగాని మంచివే అయినను కొంత వివేకమును వానికి జోడించినపుడే అవి శోభించును. లేకున్న మనుజుడు వక్రమార్గమున జను ప్రమాదముకలదు. అట్టి వివేకములేని కారణముచేతనే కొందఱు ఇతరులను నాశమొనర్చుటకుగాను తపస్సుచేయుచుందురని ఇట చెప్పబడినది. ఈ ప్రకారముగ వారు తపస్సను సాధనమును దుర్వినియోగపఱచుకొనుచున్నారు. దీనికంతటికిని మూఢత్వమే కారణము. కావున దానిని పోగొట్టుకొని రాజస, తామస తపస్సుల నాశ్రయింపక తమకున్న యా పట్టుదలను సన్మార్గమున వినియోగించి, దైవప్రాప్తికై సాత్త్విక తపస్సునే ఆశ్రయించి తరించవలయును.

ఈ శ్లోకముద్వారా ఈ క్రింది యంశములు తేలుచున్నవి -

1. మూర్ఖపుపట్టుదల పనికిరాదు. 2. శుష్కోపవాసాదులద్వారా తన శరీరమునుగాని, మనస్సునుగాని బాధించుకొనగూడదు. 3. పరప్రాణికి కీడుచేయరాదు.

ప్ర:– తామసిక తపస్సు ఎట్టిది?

ఉ:– (1) మూర్ఖపుపట్టుదలతో తన శరీరమును బాధపెట్టుట ద్వారాగాని (2) ఇతరులను నాశమొనర్పవలెనను ఉద్దేశ్యముతోగాని చేయబడు తపస్సు తామసిక తపస్సనబడును.

అ॥ ఇక నిపుడు దానములను గూర్చి చెప్పదలంచి మొట్టమొదట సాత్త్వికదానమెట్టిదో తెలుపుచున్నాడు –

20. దాతవ్యమితి యద్దానం దీయతేఽనుపకారిణే
దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్.

టీక:– *దాతవ్యమ్ ఇతి* = ఇవ్వవలసినదేయను నిశ్చయముతో, *యత్ దానమ్* = ఏ దానము, *దేశే* = (పుణ్య) ప్రదేశమందును, *కాలే చ* = (పుణ్య) కాలమందును, *పాత్రే చ* = యోగ్యునియందును, *అనుపకారిణే* = ప్రత్యుపకారముచేయు శక్తిలేనివానికొఱకు, *దీయతే* = ఇవ్వబడుచున్నదో, *తత్ దానమ్* = ఆ దానము, *సాత్త్వికమ్ (ఇతి)* = సాత్త్వికమని, *స్మృతమ్* = తలంపబడుచున్నది.

తా:– ఇవ్వవలసినదే యను నిశ్చయముతో ఏ దానము పుణ్యప్రదేశమందును, పుణ్యకాలమందును, యోగ్యుడగువానికి మఱియు ప్రత్యుపకారముచేయ శక్తిలేనివానికొఱకు ఇవ్వబడుచున్నదో అది సాత్త్వికదానమని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– 'దాతవ్యమితి' – ప్రతివాడును దానముచేయుట తన ధర్మమని తలంచి దానము చేయవలెను. అంతియేకాని ఒకరిమెప్పుకొఱకుగాని, ప్రతిఫలాపేక్షచేగాని చేయరాదు. 'నీవేల దానము చేయుచున్నా'వని యెవరైన దాత నడిగినచో 'ఇది నాధర్మము. నేను దానము చేయవలసినదే ('దాతవ్యమ్') కాబట్టి చేయుచున్నాను' అనియే సమాధానము చెప్పవలయును. వాస్తవముగ త్యాగముచేయుట, దానముచేయుట తనమేలు కొఱకే యగును. ఒకరికి ఉపకారము చేసినను అదియు (పుణ్యప్రాప్తివలన) తనకు తానుచేసికొను ఉపకారమే యగును. కావున దానముచేయువారు తామేదో ఒకరి నుద్ధరించితిమని తలంచుటకంటె ఆ దానక్రియచే తమ్ముతాము యుద్ధరించుకొనినవారైరని భావించుట యుత్తమము.

'అనుపకారిణే' – అని చెప్పినందువలన, ప్రత్యుపకారము చేయలేనివారికి, బీదవారికి, అశక్తులకు, వికలాంగులకు, దరిద్రనారాయణులకు చేయు దానము ఉత్కృష్టమని తెలుచున్నది. మఱియు శక్తిగలవారికి, ప్రత్యుపకారము చేయగల సమర్థతగలవారికి దానముచేయుట అంత ఉత్తమమైనదిగాదనియు ఈ పదముద్వారా సూచితమగుచున్నది.

'దేశే' – అనగా పుణ్యక్షేత్రమందు, తీర్థాదులందు, పవిత్ర ఆశ్రమాదులందు లేక పవిత్రమైనట్టి, దైవగంధయుతమైనట్టి ఏ ప్రదేశమందైనను అని యర్థము. 'కాలే' యనగా గ్రహణము, సంక్రాంతి, లేక ఏదైన పుణ్యకార్యసందర్భము – ఇత్యాదిరూపమగు పవిత్రకాలమునందు అని యర్థము. 'పాత్రే' యనగా యోగ్యతగలవానికి, తగినవానికి అని యర్థము. పాత్రతనెఱింగి దానముచేయుడని పెద్దలు చెప్పుదురు. అపాత్రునకు దానముచేసినచో దాతకు ఉత్తమఫలము చేకూరదని భావము.

ప్ర:– సాత్త్వికదానమనగా నెట్టిది?

ఉ:– 'దానముచేయవలసినదే' అని నిశ్చయించుకొని (1) ప్రత్యుపకారము చేయలేనివారికి, దీనులకు, అసహాయులకు (2) దేశ. కాల. పాత్రతలనుజూచి చేయబడు దానము సాత్త్వికమని చెప్పబడును.

అ॥ రాజసదానమును పేర్కొనుచున్నాడు -

21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్★.

టీక:– ప్రత్యుపకారార్థం = ప్రత్యుపకారముకొఱకుగాని, పునః = మఱల, ఫలమ్ = ఫలమును, ఉద్దిశ్యవా = ఉద్దేశించికాని, పరిక్లిష్టమ్ చ = మనఃక్లేశముతో (అతి కష్టముతో) గాని, యత్ తు = ఏదయితే, దీయతే = ఈయబడుచున్నదో, తత్ దానమ్ = ఆ దానము, రాజసమ్ *(ఇతి)* = రాజసదానమని, స్మృతమ్ = తలంపబడుచున్నది.

తా:– ప్రత్యుపకారముకొఱకుగాని, లేక ఫలము నుద్దేశించిగాని లేక మనఃక్లేశముతో (అతికష్టముతో) గాని ఇవ్వబడు దానము రాజసదానమని చెప్పబడుచున్నది.

వ్యాఖ్య:– ప్రత్యుపకారము కోరి చేయు దానము ఉత్తమమైనదికాదని నుడువుచున్నారు. ప్రత్యుపకారమభిలషించి చేయు దానము బజారులోని వ్యాపారవిధానమే (Shop - keeping) కాగలదు. ఇచ్చిపుచ్చుకొను పద్ధతి అంత శ్రేష్ఠమైనదికాదు. అది రాజసదానపద్ధతియే యగును. మఱియు తనకేదియో మున్ముందు పరలోకాదులందు ఫలము కలుగునని ఆశించి చేయుదానము, అనగా ఫలాపేక్షతో చేయు దానమున్ను ఉత్తమమైనదికాదు. నిష్కామముగా, భగవత్ప్రీత్యర్థముగా చేయుదానమే మహోన్నతమైనది.

'పరిక్లిష్టమ్' - కొందఱు దానము చేయునపుడు 'అయ్యో! ఈ వస్తువు పోవుచున్నదే' యని మనస్సులో బాధపడుచుందురు. మఱికొందఱు ఇతరుల బలవంతముచే దానము చేయుచుందురు. అట్లు క్లేశముతో దానమొసంగుట ఉత్తమపద్ధతికాదు. అట్టిది సత్ప్రయోజనమునున్ను గలుగజేయజాలదు. దానముచేయుట తనకర్తవ్యమని, (ధర్మమని) భావించి ఐచ్ఛికముగ, అనందముతో ఒకరికిచ్చుటయే సాత్త్వికదానము. తదితరము రాజస, తామస, దానములే యగును. కావున విజ్ఞుడు సాత్త్వికదానమునే అవలంబించవలెను.

ప్ర:– రాజసదాన మెట్టిది?

ఉ:– (1) ప్రత్యుపకారముకొఱకుగాని (2) ఫలమునుగోరికాని (3) మనస్సునందు బాధపడుచుగాని చేయబడు దానము రాజసదానమనబడును.

అ॥ ఇక తామస దానమునుగూర్చి వచించుచున్నాడు -

22. అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే
అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్.

★ తద్రాజసముదాహృతమ్ - పాఠాన్తరము.

టీక:– అదేశకాలే = దానమునకు తగని (అపవిత్రములగు) దేశ, కాలములందు, అపాత్రేభ్యః చ = పాత్రులు (అర్హులు) కానివారికొఱకును, అసత్కృతమ్ = సత్కారశూన్యముగను, అవజ్ఞాతమ్ = అమర్యాదతోను (అవమానపరచియు), యత్ దానమ్ = ఏ దానము, దీయతే = ఒసంగబడుచున్నదో, తత్ = అది, తామసమ్ *(ఇతి)* = తామసదానమని, ఉదాహృతమ్ = చెప్పబడినది.

తా:– దానమునకు తగని (అపవిత్రములగు) దేశకాలములందును, పాత్రులు (అర్హులు) కానివారికొఱకును, సత్కారశూన్యముగను, అమర్యాదతోను ఇవ్వబడు దానము తామసదానమని చెప్పబడును.

వ్యాఖ్య:– దానము చేయునపుడు సత్కారభావనతో, మర్యాదతో, ఆదరముతో చేయవలెనేకాని, తిరస్కారభావముతోగాదు. అనాదరభావముతో 'పో! తీసికొని పో!' అని డబ్బు మున్నగువానిని విసిరివేయరాదు. తిట్టుకొనుచు ఇవ్వరాదు. అదియంతయు తామసలక్షణమేయగును. అట్టి తామసదానమువలన దానఫలితము ఎంతయో తగ్గిపోవును. లేక అసలు లేకుండను పోవచ్చును. ఏలయనగా అశ్రద్ధతో ఇవ్వబడు వస్తువు ఇవ్వబడనిదానితోనే సమానమని భగవానుడీ యధ్యాయమందే కట్టకడకు చెప్పబోవుదురు - (అశ్రద్ధయా హుతం దత్తం ... అసదిత్యుచ్యతే); కాబట్టి ఇట్టిదానము నెవరును ఆచరించరాదు. సాత్త్వికదానమునే ఆచరించవలెను.

ప్ర:– తామసదాన మెట్టిది?

ఉ:– (1) దేశకాలపాత్రలు చూడకుండ చేయబడునదియు (2) సత్కారపూర్వకముగ చేయబడనిదియు (3) తిరస్కారభావముతో చేయబడునదియు నగుదానము తామసదాన మనబడును.

అ॥ బ్రహ్మముయొక్క నామమును గుఱించి ఐదు శ్లోకములద్వారా తెలియజేయుచున్నాడు -

23. ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః
బ్రాహ్మణాస్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా.

టీక:– బ్రహ్మణః = పరబ్రహ్మమునకు, ఓమ్ ఇతి = 'ఓమ్' అనియు, తత్ *(ఇతి)* = 'తత్' అనియు, సత్ *(ఇతి)* = 'సత్' అనియు, త్రివిధః = మూడువిధములగు, నిర్దేశః = నామనిర్ణయము (నామములు), స్మృతః = చెప్పబడినది, తేన = దానిచేత, బ్రాహ్మణాః = బ్రాహ్మణులును (బ్రహ్మజ్ఞానులును), వేదాః చ = వేదములును, యజ్ఞాః చ = యజ్ఞములును, పురా = పూర్వము, విహితాః = నిర్మింపబడినవి.

తా:– పరబ్రహ్మమునకు 'ఓమ్' అనియు, 'తత్' అనియు, 'సత్' అనియు మూడు విధములగు పేర్లు చెప్పబడినవి. ఈ నామత్రయమువలననే (దానియుచ్చారణచేతనే) పూర్వము బ్రాహ్మణులు (బ్రహ్మజ్ఞులు), వేదములు, యజ్ఞములు నిర్మింపబడినవి.

వ్యాఖ్య:– పరబ్రహ్మము వాస్తవముగ నామరూపరహితమైనను, భక్తులు ధ్యానించుటకు, చింతించుటకు అద్దానికి నామములు నిర్దేశింపబడెను. అవియే 'ఓమ్' అనియు, 'తత్' అనియు, 'సత్' అనియు చెప్పబడును. అట్టి మంత్రముల చింతనద్వారా, లక్ష్యమగు పరబ్రహ్మమును జనులు చింతనజేయుచున్నారు. సాక్షాత్ పరబ్రహ్మము యొక్క వాచకములు గనుక ఆ మూడునామములకు

మహత్తరమగుశక్తి, పవిత్రతగలిగి యున్నది. వేదశాస్త్రాదులం దెల్లెడలను ఈ ప్రణవాది మంత్రములనుగూర్చి విశేషముగ చెప్పబడియున్నది.

'తస్యవాచకః ప్రణవః' - ఆ పరమాత్మయొక్క నామము ఓంకారము.

'తజ్జపస్తదర్థభావనమ్' - "ఆ నామమును జపించుచు దానియర్థమును లెస్సగ భావించవలెను" - అని పతంజలి మహర్షియు ఓంకారమహిమనుగూర్చి శ్లాఘించియున్నారు. కర్మానుష్ఠానమందు ఏవైన లోపములు, విఘ్నములు, దోషములు మున్నగునవి యున్నచో అవియన్నియు పరమపవిత్రములగు ఆ మూడునామముల యొక్క ఉచ్చారణచే పటాపంచలైపోవును. కనుకనే ఏ కార్యమును ప్రారంభించినను పెద్దలు ప్రణవోచ్చారణము చేయుదురు. మంత్రములన్నిటిలోను ప్రణవము శిరోమణియై యలరుచున్నది. కనుకనే ప్రతిమంత్రమునకును ఆదిలో ఓంకారము చేర్చబడుచుండును. అయితే 'ఓం తత్ సత్' అను మంత్రము నుచ్చరించునపుడు అద్దాని అర్థమును భావించుచు దాని వాచ్యరూపమగు పరబ్రహ్మమును చింతనజేయవలెను. భావలముతో గూడినపుడుమాత్రమే మంత్రము ఎక్కువగ శక్తివంతమగును.

మఱియు వేదములు, యజ్ఞములు మున్నగునవి ఆ ప్రణవమంత్రోచ్చారణము చేతనే నిర్మింపబడినవని చెప్పుటవలన వేదములయొక్క మూలము, బీజము ఓంకారమే (పరబ్రహ్మమే) అయియున్నదని తెలుచున్నది. మఱియు వేదసారమంతయు ఆ ప్రణవమునందే యున్నటుల గోచరమగుచున్నది. కావున వేదసారమగు ఓంకారము నుచ్చరించి భావమును మననముచేసినపుడు సమస్త వేదములను ఉచ్చరించినట్లే యగుచున్నది.

'ఓమ్ తత్ సత్' అనుదానికి మఱియొక అర్థమున్ను గలదు. ఓమ్ అనగా పరబ్రహ్మము, తత్ అనగా అది (ఆ పరబ్రహ్మము) ఒకటియే, సత్ = సద్వస్తువు, తక్కినదియగు దృశ్యజగత్తంతయు మిథ్యావస్తువు అని యర్థము. కావున ఈ 'ఓమ్ తత్ సత్' అను మంత్రముయొక్క ఉచ్చారణచేత 'బ్రహ్మసత్యం జగన్మిథ్యా' అను సర్వవేదాంతసిద్ధాంతసారసంగ్రహము ప్రస్ఫుటమగుచున్నది. అట్టి నామోచ్చారణ చేయుచు సద్వస్తువగు బ్రహ్మమును సత్యముగ భావించుచు, మిథ్యాభూతమగు దృశ్యజగత్తును అసత్యముగ తలంచుచు వైరాగ్యభావమును అభివృద్ధిపఱచుకొనవలెను. సద్రూపదైవభావనను, ఆత్మభావనను దృఢపఱచుకొనవలెను 'ఓమ్ తత్ సత్' అను మంత్రమునకు ఈక్రింది రెండు అర్థములున్ను చెప్పవచ్చును.

(1)		(2)	
ఓమ్ =	పరబ్రహ్మము (కలదు)	తత్ =	ఆ
తత్ =	ఆ పరబ్రహ్మము	సత్ =	సద్వస్తువు
సత్ =	సద్రూపమైనది	ఓమ్ =	పరబ్రహ్మము

ప్ర:– పరబ్రహ్మమునకు ఎన్ని పేర్లు కలవు? అవియేవి?

ఉ:– మూడుపేర్లు కలవు. అవి క్రమముగ (1) ఓమ్ (2) తత్ (3) సత్ అని చెప్పబడును.

ప్ర:– వానియొక్క మహత్తు యెట్టిది?

ఉ:– వానినుండియే (లేక, వాని నామోచ్చారణచేతనే) పూర్వము (1) బ్రాహ్మణులు (బ్రహ్మజ్ఞానులు) (2) వేదములు (3) యజ్ఞములు సృష్టింపబడినవి.

ప్ర:– కావున బ్రహ్మజ్ఞానులు, వేదములు, యజ్ఞములు - వీనికి మూలమేమి?

ఉ:– ఓంకారమే. (తల్లక్ష్యమగు) పరబ్రహ్మమే.

24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞాదానతపఃక్రియాః
ప్రవర్తన్తే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్.

టీక:– తస్మాత్ = అందువలన, బ్రహ్మవాదినామ్ = వేదములను బాగుగ నెఱింగినవారి యొక్క, విధానోక్తాః శాస్త్రములందు చెప్పబడిన, యజ్ఞదాన తపః క్రియాః = యజ్ఞము, దానము, తపస్సు లనెడి కర్మలు, సతతమ్ = ఎల్లప్పుడును, ఓమ్ ఇతి = 'ఓమ్.' అని, ఉదాహృత్య = చెప్పి(నపిమ్మట), ప్రవర్తన్తే = ప్రవర్తించుచున్నవి (అనుష్ఠింపబడుచున్నవి).

తా:– అందువలన, వేదములను బాగుగనెఱింగినవారియొక్క శాస్త్రోక్తములగు యజ్ఞదాన తపః క్రియలన్నియు ఎల్లప్పుడును 'ఓమ్' అనిచెప్పిన పిమ్మటనే అనుష్ఠింప బడుచున్నవి.

వ్యాఖ్య:– 'ఓమ్. తత్. సత్' అను మూడుపదములలోను మొదటిది యగు 'ఓమ్' అను పదముయొక్క మహిమను వెల్లడించుచున్నారు - పరబ్రహ్మముయొక్క వాచకము (నామము) అయి అతిపవిత్రమై, మహాశక్తివంతమై యలరుచుండుటచే వేదవేత్తలందఱును తాము ప్రారంభించు యజ్ఞ దాన తపస్సులను క్రియలన్నిటియొక్క ఆదియందు ఎల్లప్పుడును 'ఓమ్' అను ఆ ఏకాక్షర ప్రణవమంత్రమును ఉచ్చరించుచున్నారు. అట్లుచ్చరించిన పిదపయే ఆ యా క్రియలను వారు ఉపక్రమించుదురు. (అట్లే ఆ యా క్రియలు సమాప్తమైన వెనుకను మఱల 'ఓమ్' అని (ఆ ప్రణవమును) ఉచ్చరించుచుందురు). అట్లొనర్చుటవలన ఆ యా క్రియలలో ఏవైనలోపములు, దోషములు ఉన్నచో అన్నియు తన్మంత్రప్రభావమువలన భస్మీభూతములైపోవ ఆ కర్మలు పరిపూర్ణఫలముల నొసంగగలవు.

'సతతమ్' - (ఎల్లప్పుడును) అని చెప్పుటవలన అట్టి వేదవేత్తలు తామాచరించు ఆ యా యజ్ఞదానాది సత్క్రియల ప్రారంభమున ఎల్లప్పుడును ఆ ప్రకారమే ప్రణవోచ్చారణము చేయుదురని స్పష్టమగుచున్నది. ఇంజనువలన రైలుపెట్టెలన్నియు కదలునట్లును, ఒకటి యను సంఖ్యచే ప్రక్కనగల పూర్ణానుస్వారములు (సున్నలు) అన్నియు శక్తివంతము లగునట్లును, మొదటగల ఓంకారముచే తక్కిన మంత్రములు క్రియలు అన్నియు చైతన్యవంతములు, ప్రతిభావంతములు అగును.

ప్ర:– 'ఓం కారము' యొక్క మహిమను తెలుపుడు?

ఉ:– వేదవేత్తలు తా మాచరించు యజ్ఞ దాన తపఃక్రియలకు మొదట ఎల్లప్పుడును ఓం కారమును ఉచ్చరించియే పిమ్మట ఆ యా క్రియలను చేయుచుందురు.

25. తదిత్యనభిసన్ధాయ ఫలం యజ్ఞతపః క్రియాః
దానక్రియాశ్చ వివిధాః క్రియన్తే మోక్షకాంక్షిభిః.

టీక:– మోక్షకాఙ్క్షిభిః = ముముక్షువులచేత, 'తత్' ఇతి = 'తత్' అని, (ఉదాహృత్య = (బ్రహ్మనామమును) ఉచ్చరించి), ఫలమ్ =ఫలమును, అనభిసన్ధాయ = కోరక, వివిధాః = పలువిధములైన, యజ్ఞ తపః క్రియాః = యజ్ఞములు, తపస్సులు మున్నగుకర్మలు, దాన క్రియాః చ = దానరూపములగు కర్మలును, క్రియన్తే = చేయబడుచున్నవి.

తా:– అట్లే 'తత్' అను పదమును ఉచ్చరించియే ముముక్షువులు ఫలాపేక్షలేక పలువిధములైన యజ్ఞ, దాన, తపః కర్మలను చేయుచున్నారు.

వ్యాఖ్య:– ముముక్షువులు ఫలమమునుగోరక యజ్ఞ, దాన తపః క్రియల నాచరించుదురని చెప్పుటవలన ఫలాభిసంధిరహితముగ నాచరించునపుడే చిత్తశుద్ధి ద్వారా ఆ యాక్రియలు మోక్షమునకు సహాయభూతములుగ నుండునని తెలియుచున్నది. ఇట్టి కర్మ ఫలత్యాగమే గీతయొక్క ప్రధానబోధలలో నొకటియైయున్నది; మఱియు ముముక్షవునకత్యంతావశ్యకమైన అంగమైయున్నది.

మఱియు నిచట 'మోక్ష కాఙ్క్షులు. తపోయజ్ఞదానాదిక్రియలను నిష్కామముగా నాచరించుదురని చెప్పుటవలన, చిత్తశుద్ధిద్వారా ఆ యాక్రియలు మోక్షమునకు సహాయకారులుగ నుండుననియు, అట్టి తపోదానాది పుణ్యకార్యములను ముముక్షువు ముక్తి రూపమగు తన లక్ష్యప్రాప్తికై తప్పక ఆచరించవలెననియు నిచట ధ్వనించుచున్నది. అనగా ఆ యజ్ఞదాన తపః కార్యములను ముముక్షువులు వదలివేయరాదనియు, అవి యన్నియు మోక్షమునకు సహాయభూతములుగ నుండుననియు తెలిపినట్లైనది. ఈ భావముచే రాబోవు అధ్యాయమున 'యజ్ఞదానతపః కర్మ న త్యాజ్యం కార్యమేవతత్' అను శ్లోకము ద్వారా గీతాచార్యులు స్పష్టీకరించుదురు; లోకములో నిపుడు కొందఱు పుణ్యకార్యములను తక్కువగా జూచుచుందురు. వానిని చేయవద్దనియు, అవి బంధము గలిగించుననియుగూడ చెప్పుదురు. కాని భగవానుడు గీతలో అట్లు చెప్పలేదు. \వానిని వదలవద్దని చెప్పుటయేకాక తప్పక ఆచరించవలయుననిగూడ పేర్కొనిరి. కాబట్టి మహాత్ముల వాక్యములపై విశ్వాసముంచి జనులు ఫలాపేక్షారహితముగ (జ్ఞాన) యజ్ఞతపోదానాది పుణ్యకార్యముల నాచరించి, చిత్తశుద్ధిని బడసి మోక్షభాగులు కావలయును.

ప్ర:– మోక్షము నభిలషించువారు ఏ ప్రకారముగ ప్రవర్తించుదురు?

ఉ:– 'తత్' అను బ్రహ్మవాచకము నుచ్చరించి వివిధములగు తపోయజ్ఞదానాది పుణ్యకార్యములను ఆచరించుదురు.

ప్ర:– ఆ యా కార్యములను వారెట్లాచరించెదరు?

ఉ:– ఫలాపేక్షారహితముగ.

ప్ర:– కావున మోక్షప్రాప్తికి మార్గమేదియని తేలుచున్నది?

ఉ:– 'ఓమ్' 'తత్' 'సత్' అను పరబ్రహ్మముయొక్క వాచకములగు పవిత్రనామముల నుచ్చరించి, తపో (జ్ఞాన) యజ్ఞదానాది వివిధక్రియలను ఫలాపేక్షారహితముగ నాచరించుటచే చిత్తశుద్ధి ద్వారా జ్ఞానము, దానిచే మోక్షము లభింపగలదు; కావున ఇదియే మోక్షప్రాప్తికి మార్గమైయున్నది.

26. సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే
ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే.

టీక:– పార్థ = ఓ అర్జునా!, సద్భావే = 'కలదు' అనెడి అర్థమందును, సాధుభావే చ = 'మంచిది' అనెడి అర్థమందును, సత్ ఇతి ఏతత్ = 'సత్' అను ఈ పరబ్రహ్మనామము, ప్రయుజ్యతే = ప్రయోగింపబడుచున్నది, తథా = ఆలాగుననే, ప్రశస్తే కర్మణి = ఉత్తమమైన కర్మమునందును, సత్ శబ్దః = 'సత్' అను పదము, యుజ్యతే = ప్రయోగింపబడుచున్నది.

తా:– ఓ అర్జునా! 'కలదు' అనెడి అర్థమందును, 'మంచిది' అనెడి అర్థమందును 'సత్' అను ఈ పరబ్రహ్మనామము ప్రయోగింపబడుచున్నది. అట్లే ఉత్తమమైన కర్మమునందును ఆ 'సత్' అను పదము వాడబడుచున్నది.

వ్యాఖ్య:– పరబ్రహ్మవాచకమగు 'సత్' అను పదము 'ఉనికి'ని, 'శ్రేష్ఠత్వము'ను రెండింటిని సూచించుచున్నది. ఆ రెండు అర్థములలోగూడ ఆ పదము ప్రయోగింపబడుచుండును. (దృష్టాంతమునకు సత్ + భావము = ఉనికి).

ప్ర:– పరబ్రహ్మవాచకమగు 'సత్' అను పదము ఏ యర్థములందు వాడబడుచుండును?

ఉ:– (1) 'కలదు' అను అర్థమందును ('ఉనికి' యనెడి అర్థమందు), (2) 'మంచిది' అనెడి అర్థమందును అది వాడబడుచున్నది.

27. యజ్ఞే తపసి దానే చ స్థితిస్సదితి చోచ్యతే
కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే.

టీక:– యజ్ఞే = యజ్ఞమునందును, తపసి చ = తపస్సునందును, దానే చ = దానమునందును (గల), స్థితిః = నిష్ఠ (లేక, ఉనికి), సత్, ఇతి ఉచ్యతే = 'సత్' అని చెప్పబడుచున్నది, తదర్థీయం కర్మ చ ఏవ = ఆ బ్రహ్మోద్దేశమైన (భగవత్ప్రీత్యర్థమైన) కర్మకూడ, సత్ ఇతి ఏవ = 'సత్' అనియే, అభిధీయతే = పిలువబడుచున్నది.

తా:– యజ్ఞమునందును, తపస్సునందును, దానమునందుగల నిష్ఠ (ఉనికి) కూడ 'సత్' అని చెప్పబడుచున్నది. మఱియు బ్రహ్మోద్దేశమైన (భగవత్ప్రీత్యర్థమైన) కర్మలు కూడ 'సత్' అనియే పిలువబడుచున్నవి.

వ్యాఖ్య:– గీతయందు తపో, యజ్ఞదానాది పుణ్యకార్యములను భగవానుడు లెస్సగ ప్రోత్సహించుచున్నాడు. వానియందలి స్థితి (ఉనికి, నిష్ఠ) కేవలము బ్రహ్మవాచకమగు 'సత్' అనియే ఈశ్లోకమునందు చెప్పుట వలన ఆ పుణ్యకార్యములకెట్టి ఆధిక్యత యొసంగబడెనో విదితమగుచున్నది. మఱియు 'తదర్థీయం కర్మ' అనగా భగవత్ప్రీత్యర్థమగు (భగవత్సంబంధమగు) కర్మయు 'సత్' అని చెప్పుటవలన అట్టి కర్మయు, పైనదెల్పిన యజ్ఞాదికర్మలున్ను చిత్తశుద్ధిద్వారా సద్రూపమగు బ్రహ్మమునే పొందించునని స్పష్టమగుచున్నది. ఇవ్విధముగ సద్రూపమగు బ్రహ్మముయొక్క ప్రాప్తికి

హేతుభూతములగుటవలననే ఆ యా పుణ్యకార్యములను, వానియందలిస్థితిని సాక్షాత్ బ్రహ్మముయొక్క నామమగు సత్తుగనే ఇచట వర్ణింపబడినది. అయితే కర్మ 'తదర్థీయము'గా నున్నపుడే అనగా, భగవత్సంబంధమైనదిగా (భగవత్ప్రీత్యర్థముగ, భగవద్భావనతో చేయబడినదిగా, మఱియు నిష్కామముగా) నున్నపుడే ఆ కర్మ సామాన్య కర్మగా నుండిపోవునేకాని బ్రహ్మరూపమగు 'సత్తు' గా నుండదు. కాబట్టి వాస్తవముగ కర్మలో లోపములేదు. కర్మచేయు విధానమందే లోపము కలదు. దైవబుద్ధితో చేసినచో కర్మ దైవరూపమును ('సత్' రూపమును) తప్పక బడయగలదని ఈ శ్లోకముద్వారా వ్యక్తమగుచున్నది. కావున అట్టి యజ్ఞదానాది పుణ్యకార్యములను భగవత్ప్రీత్యర్థముగ, నిష్కామముగ నాచరించి జనులు చిత్తశుద్ధిని తద్ద్వారా 'సత్' రూప బ్రహ్మప్రాప్తిని బొందవలయును. ఈశ్లోకమందు భగవానుడు కర్మయందు దైవత్వమును బోధించిరి.

ప్ర:– యజ్ఞదానతపంబులందలి నిష్ఠను, భగవత్ప్రీత్యర్థకర్మను పెద్దలు ఏమందురు?

ఉ:– పరబ్రహ్మవాచకమగు 'సత్' అని అందురు (అనగా అవి దైవరూపములేయనిభావము).

అ॥ అశ్రద్ధతో నాచరింపబడు కార్యము అసత్తనియే (చేయబడనిదానితో సమమనియే, లేక, బ్రహ్మసంబంధము కానిదనియే) చెప్పుచున్నాడు -

28. అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్
అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ.

టీక:– పార్థ = ఓ అర్జునా!, అశ్రద్ధయా = అశ్రద్ధతో, హుతమ్ = హోమమొనర్పబడినదియు, దత్తమ్ = దానముచేయబడినదియు, తప్తం తపః చ = చేయబడిన తపస్సును, కృతమ్ చ = చేయబడిన ఇతరకర్మలున్ను, యత్ = ఏదికలదో, (తత్ = అది), 'అసత్' ఇతి = 'అసత్తు' అని, ఉచ్యతే = చెప్పబడుచున్నది; తత్ = అది, ప్రేత్య = పరలోకఫలముకొఱకు, న = కాదు, ఇహ చ = ఇహలోక ఫలముకొఱకును, న = కాదు.

తా:– ఓ అర్జునా! అశ్రద్ధతో చేయబడిన హోమముగాని, దానముగాని, తపస్సుగాని, ఇతర కర్మలుగాని 'అసత్తని' చెప్పబడును. అవి ఇహలోకఫలమును (సుఖమును) గాని, పరలోకఫలమును (సుఖమును) గాని కలుగజేయవు.

వ్యాఖ్య:– పరమార్థసాధనలయందుగాని, లేక వ్యవహారమునగాని శ్రద్ధకు అత్యధిక ప్రాముఖ్యతగలదు. శ్రద్ధతోగూడని కార్యము ఏరంగమందైనను విఫలమేయగును. ఇక పరమార్థరంగమున వేఱుగ జెప్పవలెనా? కనుకనే భగవానుడు గీతయందు పెక్కుచోట్ల శ్రద్ధయొక్క ఆవశ్యకతను నొక్కివక్కాణించుచున్నారు. గీత పూర్తికాబోవుచున్న ఈసమయమునగూడ శ్రీకృష్ణమూర్తి శ్రద్ధనుగూర్చి బోధింపదగు అవకాశమును ఏమాత్రము జారవిడుచుకొనలేదు. ఏ కార్యమైనప్పటికిని, అది హోమముకాని, దానముకాని, తపస్సుకాని, అధ్యయనముకాని శ్రద్ధతో జేయబడనిచో నిరుపయోగమగును; దైవసంబంధము లేనిదగును; అసత్తే (Zero) యగును. అనగా చేయనిదానితో సమానమేయగును - అని యిచట పేర్కొనబడినది. ఒకవేళ అట్టికార్యము ఈ లోకమున ఫలించకున్నను పరలోకమున ఏమైన ఫలించునాయనిన,

అచటను ఫలించదు (న చ తత్ప్రేత్య) అని ఖండితముగ చెప్పివేయబడెను; వంటకు పనికివచ్చు పదార్థములన్నియు సిద్ధముగనున్నప్పటికిని, వండువానికి ఏశ్రద్ధలేనిచో, ఆ వంటక మెట్లు చెడిపోవునో, అట్లే అధ్యాత్మక్షేత్రమందును ముముక్షువునకు తక్కిన యెన్నిగుణములున్నప్పటికిని శ్రద్ధ యొక్కటి లేనిచో సాధన ఫలించనేరదు. అత్తఱి వ్యర్థపరిశ్రమయే యగునని తెలుచున్నది. లేక, శ్రద్ధతో చేయనికార్యము అసత్తగు జగద్రూపముగనే యుండునుగాని సత్యమగు పరమార్థరూపమును బొందదనియు చెప్పవచ్చును. ఈ ప్రకారముగ ఇహలోకమునగాని, పరలోకమునగాని శ్రేయమునొసంగజాలని ఈ అశ్రద్ధను ముముక్షువు పారద్రోలి, సమస్తకార్యములందును శ్రద్ధను జోడించి తాను జేయుకార్యము అసత్తుగా (నిష్ఫలముగా) పరిణమించక సత్తుగా (దైవరూపముగ) పరిణమించులాగున చేసికొనవలెను. అపుడే యాతడు పరమార్థపథమున శీఘ్రముగ ఉన్నతిని బడయగలడు.

ప్ర:— అశ్రద్ధతో చేయబడు తపోయజ్ఞదానాదికర్మ లెట్టిఫలితమును గలుగజేయును?

ఉ:— ఏ ఫలమును గలుగజేయవు. అవి నిష్ఫలములేయగును. అవి చేయనివానితో సమానమేయగును. అసద్రూపములేయగును.

ప్ర:— అవి పరలోకమందైన ఫలించవా?

ఉ:— ఎక్కడను ఫలించవు.


ప్ర:— కాబట్టి తేలినయంశమేమి?

ఉ:— ప్రతివారును శ్రద్ధను ఆశ్రయించి, ద్విగుణీకృత విశ్వాసముతో, శ్రద్ధతో, వారివారి ఆధ్యాత్మికాది కార్యముల నొనర్పవలెను.

ఓమ్
ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే
శ్రీకృష్ణార్జునసంవాదే శ్రద్ధాత్రయ విభాగయోగో నామ
సప్తదశోఽధ్యాయః
ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జునసంవాదమునగు
శ్రీ భగవద్గీతలందు శ్రద్ధాత్రయ విభాగయోగమను
పదునేడవ అధ్యాయము
ఓమ్ తత్ సత్



మోక్షసన్న్యాసయోగము



యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ. (18-78)

ఎచట యోగేశ్వరుడగు శ్రీకృష్ణుడున్ను ఎచట ధనుర్ధారియగు అర్జునుడున్ను ఉందురో అచట సంపదయు, విజయమున్ను, ఐశ్వర్యమున్ను, దృఢమగు నీతియు ఉండునని నా యభిప్రాయము.